## ప్రజలకు అండగా ప్రభుత్వం : టిజిఐఐసి చైర్మన్ నిర్మలజగ్గారెడ్డి

**సంగారెడ్డి బ్యూరో, జూన్ 29, ప్రభాతవార్త :**

సోమవారం సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని పోతిరెడ్డిపల్లిలోని ఫంక్షన్ హాల్‌లో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన అప్పులను తీర్చడానికే ప్రభుత్వానికి సమయం పడుతోందన్నారు. పథకాల అమలుపై ధీమా వ్యక్తం చేస్తూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా వెనకడుగు వేయకుండా ఒక్కొక్కటిగా పథకాలను అమలు చేస్తూ ప్రజలకు చేయూతనిస్తోందని తెలిపారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భూమిలేని వారికి మూడు ఎకరాల పథకం ఎందుకు అమలు చేయలేదని బిఆర్ఎస్ ఎమ్మెల్యేను ప్రశ్నించారు. హామీల గురించి మీరు తప్పుకుంటూ పోతే.. గత పదేళ్ల మీ పాలనలో ఇచ్చిన మోసపూరిత హామీలను మేము కూడా తవ్వాల్సి వస్తుందని నిర్మలా జగ్గారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డిల మధ్య జరిగిన రాజకీయ సంభాషణలు జిల్లాలో హాట్ టాపిక్ గా మారాయి.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## ప్రభుత్వ స్థలాల కబ్జాలపై చర్యలు తీసుకోవాలి

**జహీరాబాద్ జూన్ 29 (ప్రభాతవార్త) :** పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయని, వాటిని కాపాడాలని కోరుతూ 27వ వార్డు కౌన్సిలర్ నామ స్రవంతి రవికిరణ్ ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. పట్టణంలోని పలు కాలనీలలో ప్రభుత్వ స్థలాలను అక్రమంగా కబ్జాచేసి నిర్మాణాలు చేపడుతున్నారని, వెంటనే వాటిని నిలిపివేసి ప్రభుత్వ భూములను రక్షి ంచేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. అదేవిధంగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న నాలాలను కూడా ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ స్థలాలలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలని ఆమె కోరారు. జహీరాబాద్ పట్టణంలోని అనేక అంగన్‌వాడీ కేంద్రాలు ఇప్పటికీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఆయా కేంద్రాలకు శాశ్వత సొంత భవనాలు నిర్మించాలని వినతి పత్రంలో కోరారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ ఆస్తులను పరిరక్షి ంచాలని నామ స్రవంతి ఆర్డీవోను కోరారు.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

## ప్రజావాణికి అధికారులు హాజరుకావాలి

### గైర్హాజరైన అధికారులకు షోకాజ్ మెమోలు జారీ చేయాలని ఆదేశం

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి బ్యూరో, జూన్ 29, ప్రభాతవార్త :** ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు హాజరు కావాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ స్పష్టం చేశారు. ముందస్తు సమాచారం లేకుండా గైర్హాజరయ్యే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ పాండు, ఆర్డీఓ రాజేందర్‌తో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీక రించారు. అందిన అర్జీలను పరిశీలించి, వాటి సత్వర పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు పంపించారు. ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులు హాజరు వివరాలను శాఖల వారీగా పరిశీలించిన కలెక్టర్, ముందస్తు సమాచారం ఇవ్వకుండా పలువురు అధికారులు గైర్హాజరైనట్లు గుర్తించి అసంతృప్తి వ్యక్తం చేశారు. గైర్హాజరైన అధికారులకు షోకాజ్ మెమోలు జారీచేసి సంజాయిషీ కోరాలని ఆదేశించారు. ఇకపై ప్రజా వాణికి గైర్హాజరయ్యే అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు అత్యంత ముఖ్యమైన వేదిక అని, అధికారులు దాని ప్రాధాన్యతను గుర్తించి విధిగా హాజరుకావాలని సూచించారు. ప్రజల నుంచి అందిన ప్రతి వినతిని అంకితభావంతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ప్రజావాణికి మొత్తం 75 వినతులు అందాయి. వాటిలో కలెక్టరేట్ ప్రజావాణికి 37, సంగారెడ్డి డివిజన్‌కు 19, నారాయణఖేడ్ డివిజన్‌కు 9, జహీరాబాద్ డివిజన్‌కు 8, ఆందోల్ డివిజన్‌కు 2 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు, పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) లక్ష్మీకిరణ్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

ప్రజావాణి దరఖాస్తులను సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మికిరణ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి అధికారులపై నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వస్తారని తెలిపారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కరించాలన్నారు. 162 దరఖాస్తులను స్వీకరించినట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో డిఆర్వో నాగరాజమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, వివిధశాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏడుపాయలలో కాటేజీల నిర్మాణానికి రూ.7 కోట్లు

### ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్

**పాపన్నపేట, జూన్ 29, ప్రభాతవార్త :**

ఏడుపాయల వనదుర్గ భవానీ అమ్మవారి ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరోకీలక నిర్ణయం తీసు కుంది. భక్తులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించేందుకు ఆలయ ప్రాం గణంలో 12 ఎకో-ఫ్రెండ్లీ కాటేజీల నిర్మాణానికి రూ.7 కోట్ల నిధులను మంజూరు చేస్తూ తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వాణిప్రసాద్ సోమవారం జీవో ఆర్‌టీఈ నెం. 193ను జారీ చేశారు. జీవో ప్రకారం, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏడుపాయల క్షేత్రంలో పర్యావరణ రహిత ప్రమాణాలతో 12 ఆధునిక కాటేజీలను నిర్మించనున్నారు. ఇందుకోసం రూ.7 కోట్ల పరి పాలనా అనుమతులు మంజూరు చేస్తూ, పనులను వేగవంతంగా ప్రారంభిం చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలంగాణ టూరిజం డెవలప్ మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ప్రతి సంవత్సరం జరిగే ఏడుపాయల జాతరతోపాటు నిత్యం వేలాది మంది భక్తులు ఆలయాన్ని దర్శించుకుంటున్నారు. అయితే, వసతిసౌకర్యాల కొరత కారణంగా భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కాటేజీల నిర్మాణం పూర్తయితే భక్తులకు నాణ్యమైన వసతి అందడంతోపాటు, ఏడుపాయలక్షేత్రం ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధిచెందుతుందని అధికారులు భావిస్తున్నారు. ప్రజలు, భక్తులు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, ఆలయ అభివృద్ధికి ఇది మరో కీలక ముందడుగు అని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

**సంగారెడ్డి బ్యూరో, జూన్ 29 ప్రభాతవార్త:** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిందిదొడ్డి సతీష్, జిల్లా ఉపాధ్యక్షులు అర్జున్, సహాయ కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా నాయకురాలు వాణి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

# దేశానికి వెన్నెముక రైతు

### మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

**కోహెడ, జూన్ 29, ప్రభాతవార్త :** రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు పడి రైతులు పాడి పంటలతో ఆయురారోగ్యాలతో ఉండాలని భూమాతను ప్రార్థిస్తూ సిద్దిపేటజిల్లా కోహెడ మండలం కూరెళ్ల గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా వ్యవసాయ కార్యక్రమాలు ప్రారంభించినట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కూరెళ్ల గ్రామంలో ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని రైతులతో కలిసి దుక్కి దున్ని విత్తనాలు చల్లిన అనంతరం ఆయన మాట్లాడారు. ఏరువాక పౌర్ణమి తెలంగాణ రైతాంగ సంస్కృతికి ప్రతీక అన్నారు. కొత్త వ్యవసాయ పనులను ప్రారంభిస్తూ.. భూమాతకు, ప్రకృతికి నమస్కరించి మంచి పంటలు పండాలని కోరుకునే పవిత్రమైన రోజు అన్నారు. అన్నాన్ని పండించే రైతే ఈ దేశానికి వెన్నెముక అని చెప్పారు. రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని... అందుకే కాంగ్రెస్‌సర్కార్ రైతు సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం సాగునీటి వసతుల మెరుగుదల, నాణ్యమైన విత్తనాల, ఎరువుల సరఫరా, వ్యవసాయానిక అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తుందన్నారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా రైతులు శాస్త్రీయ పద్ధతుల్లో సాగుచేయాలన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ నాణ్యమైన విత్తనాలను మాత్రమే ఉపయోగించాలన్నారు. నీటిని పొదుపుగా వినియోగిస్తూ ప్రకృతి అనుకూల వ్యవసాయాన్ని సాగు చేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అధిక దిగుబడులు సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. పవిత్రమైన రోజున భూమాత ఆశీర్వాదంతో ప్రతి రైతు కుటుంబం సంతోషంగా ఉండాలన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఎఎంసి చైర్మన్లు, వైస్ చైర్మన్లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నాగలి దున్నుతున్న మంత్రి ప్రభాకర్‌గౌడ్

## ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలి

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

**సంగారెడ్డి బ్యూరో, జూన్ 29, ప్రభాతవార్త**

సమగ్ర ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా బీఎల్‌వోలు పంపిణీ చేస్తున్న ఎన్యూమరేషన్ ఫారాలను ప్రతి ఓటరు పూర్తిగా నింపి తిరిగి సమర్పిస్తేనే వారి పేరు ముసాయిదా ఓటరు జాబితాలో నమోదు అవుతుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, సంబంధిత ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ పురోగతి, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ తదితర అంశాలపై సమీక్షి ంచారు. రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పూర్తి పారదర్శకంగా, నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. బీఎల్‌వోలే స్వయంగా ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలని, ఈ బాధ్యతలను ఇతరులకు అప్పగించడం లేదా వారి ద్వారా సర్వే నిర్వహించడం అనుమతించబోదని స్పష్టం చేశారు. సూపర్‌వైజర్లు తమ పరిధిలోని గ్రామాలు, పట్టణాల్లో నిరంతరం పర్యటిస్తూ బీఎల్‌వోల పనితీరును పర్యవేక్షించాలని సూచించారు. ఓటర్లకు సహాయం అందించేందుకు ఏర్పాటు చేసిన 1950 ఓటర్ హెల్ప్‌లైన్, కలెక్టరేట్, ఈఆర్వో కార్యాలయాల్లోని హెల్ప్‌డెస్క్‌ల వివరాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. ఫారాలు నింపడంలో ఇబ్బందులు ఎదురైతే ప్రజలు హెల్ప్‌లైన్, హెల్ప్‌డెస్క్‌ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. విధుల నిర్వహణ సమయంలో బీఎల్‌వోలు ఎన్నికల సంఘం అందజేసిన టీషర్ట్, క్యాప్, ఐడీకార్డు, బ్యాగ్‌ను ధరించాలని తెలిపారు. దీంతో ప్రజలు వారిని సులభంగా గుర్తించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలతో మర్యాదగా, సహనంతో వ్యవహరించాలని బీఎల్‌వోలకు సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, ఓటరు అవగాహన కార్యక్రమాలు, క్షేత్రస్థాయి అధికారుల పర్యటనలు, ప్రత్యేకకార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా వేదికల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు 55 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన పెరుగుతోందన్నారు. జిల్లాలో వంద శాతం ఫారాలు పంపిణీ చేసి, పూర్తిగా నింపిన ఫారాలను సేకరించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఓటరు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడంతో పాటు ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నామని చెప్పారు. నిర్ణీత గడువులోగా ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ పాండు, ఆర్డీఓలు రాజేందర్, రమేష్, వెంకటేశం, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

## ప్రారంభంలోనే వాయిదా పడిన సదాశివపేట పురపాలక కౌన్సిల్ సమావేశం

### సమావేశ మందిరంలో మహిళా కౌన్సిలర్లు.. కమిషనర్ ఛాంబర్‌లో భర్తలు

**సదాశివపేట, జూన్ 29 (ప్రభాతవార్త):**

సదాశివపేట పురపాలక సంఘం లో సోమవారం నిర్వహించాల్సిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ప్రారంభా నికి ముందే వాయిదా పడడం చర్చనీయాంశంగా మారింది. పురపాలక పాలనలో సరైన ప్రణాళిక లేకపోవడం, సమావేశాల నిర్వహణలో స్పష్టత కొరవడటంపై ప్రజలు, ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సమావేశానికి మహిళా కౌన్సిలర్లు హాజరుకాగా, వారి భర్తలు కమిషనర్ ఛాంబర్‌లో ఉండడం అక్కడ చర్చకు దారితీసింది. ఇదే సమయంలో ఎస్ఐఆర్ అంశంపై ప్రత్యేకంగా చర్చించేందుకు సమావేశం నిర్వహించాలని 4వ వార్డు కౌన్సిలర్ నజీరుద్దీన్ పట్టుబట్టినట్లు సమాచారం. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శివాజీ మాట్లాడుతూ, కౌన్సిలర్లకు ఎజెండాపై పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అలాగే అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులు మంజూరైన నేపథ్యంలో మరికొన్ని అంశా లను ఎజెండాలో చేర్చాల్సి రావడంతో ప్రస్తుత సమావేశాన్ని వాయిదా వేసి నట్లు వెల్లడించారు. త్వరలోనే సవరించిన ఎజెండాతో మరోసారి సమావేశం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. అయితే, సమావేశం వాయిదా వెనుక మరికొన్ని కారణాలు ఉన్నాయని, అందుకే చివరి నిమిషంలో ఈ నిర్ణయం తీసుకున్నారని కొందరు కౌన్సిలర్లు, ప్రజలు గుసగుసలాడటం కనిపించింది. ఇప్పటికైనా అధికారులు సమగ్ర ప్రణాళికతో, అన్ని అంశాలను పొందుపరిచిన స్పష్టమైన ఎజెండాను రూపొందించి సమావేశాలను నిర్వహించాలని కౌన్సిలర్లు కోరుతున్నారు. సదాశివపేట పురపాలక పాలనలో పారదర్శకత, ప్రణాళికాబద్ధత పెరగాలని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ

## అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

ప్రభుత్వ జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు 2026 సంవత్సరానికి గానూ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఢిల్లీ మానవ వనరుల అభివృద్ధి, మంత్రిత్వశాఖ ఆహ్వానిస్తుందని డీఈఓ శాస్త్రి సోమవరం తెలిపారు. జూల్ 10లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని తెలిపారు. అవకాశాన్ని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సద్విని యోగం చేసుకోవాలన్నారు. జూలై 13లోగా హార్డ్ కాపీ ఒరిజనల్, జిరాక్స్ సెట్స్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

## వ్యాపారస్తులు వృత్తి వ్యాపార లైసెన్స్ పొందండి

### మున్సిపల్ కమిషనర్ సాయికుమార్

**నర్సాపూర్, జూన్ 28, ప్రభాతవార్త :**

నర్సాపూర్ మున్సిపాలిటీలో వ్యాపారాలు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మున్సిపాలిటీ కార్యాలయం ద్వారా వృత్తి వ్యాపార లైసెన్స్ (ట్రేడ్ లైసెన్స్) పొందాలని మున్సిపల్ కమిషనర్ చెరుకు సాయికుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క వ్యాపారస్తులు ఆన్‌లైన్ ద్వారా ట్రేడ్ లైసెన్స్‌ని పొందాలని సూచించారు. గతంలో ట్రేడ్ లైసెన్స్ పొందిన వారు రెన్యువల్ తీసుకోవాలన్నారు. లేనియెడల మున్సిపల్ చట్టం 2019 ప్రకారం జరిమానాలు విధిస్తూ, చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ చెరుకు సాయికుమార్ హెచ్చరించారు.

## ఆరెగూడెంలో అర్ధరాత్రి దొంగల హల్చల్

### రెండు ఇళ్లల్లో నగదు, నగలు అపహరణ

**వెల్దుర్తి, జూన్ 29, ప్రభాతవార్త :**

మండలంలోని ఆరెగూడెం గ్రామ పంచాయతీలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు హల్చల్ చేశారు. దొంగలు రెండు ఇళ్లల్లో దొంగతనానికి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన చాకలి భాగ్య, ఏర్పుల నవీన్ ఇళ్లలో చొరుబడి దొంగతనానికి పాల్పడ్డారు. చాకలి భాగ్యకు చెందిన పదివేల రూపాయల నగదు. ఐదు తులాల వెండి ఒక మాసం బంగారం ముక్కెర చోరీ చేయగా, నవీన్ ఇంట్లో బంగారు పుస్తెలు, వెండి కడియాలు. చేతి గాజులు, పట్టాగొలుసులు దొంగిలించారు. సోమవారం ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ‘సర్’తో నకిలి ఓట్లకు చెక్

### ఓటరు జాబితా ప్రక్షాళనలో ‘సర్’కు అందరూ సహకరించాలి

### ఓటు కోసం ఇంటింటికీ ఎన్నికల సంఘం

### అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం


### ఓటర్లలో వీడని అభద్రతా భావం

**టేక్మాల్, జూన్ 29, ప్రభాతవార్త:** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుహక్కు వజ్రాయుధం. నచ్చిన పాలకులను ఎన్నుకునేందుకు ఇదొక బ్రహ్మాస్త్రం. రాజ్యాంగం పౌరుడికి కల్పించిన హక్కు ఇది. మన పాలకులను మన పౌరులే ఎన్నుకోవాలి. కాగా ఇది అక్రమ వలసదారులు, దురాక్రమణ దారులతో పాటు అక్కడక్కడ విదేశీ పౌరుల చేతుల్లోకి వెళ్లిపోతోంది. దీనిని పూర్తిగా, సక్రమంగా నిర్మూలించడానికి కేంద్రం సంకల్పించింది. దీని కోసమే ఓటర్ల జాబితా సమగ్ర సవరణకు ప్రత్యేకంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియను చేపట్టింది. దీనినే క్లుప్తంగా సర్ అంటున్నారు. ప్రతి కుటుంబాన్ని తప్పనిసరిగా సందర్శించి సర్వేను వంద శాతం పూర్తి చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలను ఇప్పటికే జారీ చేసింది. బిఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు ఇస్తున్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన బూత్ లెవెల్ ఏజెంట్ (బిఎల్ఏ)లు ఇందులో పాల్గొంటున్నారు. అయితే ఫారాలు ఇవ్వవలసిన బాధ్యత మాత్రం బూత్‌లెవెల్ ఆఫీసర్లదే. ఏజెంట్లు ఈ ఫారాలు ఇవ్వడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ వీల్లేదు.

2002 నాటి సర్ డేటాతో మ్యాపింగ్ అయితే వెరిఫికేషన్ పూర్తయినట్లే. అంటే 2002 నాటి ఓటర్ల జాబితాలో పేరు ఉంటే దానిని అర్హతగా తీసుకొని సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో డేటా ఎంట్రీ, డిజిటలైజేషన్ పూర్తి చేస్తున్నారు. ఇలా 2002 సర్' డేటాతో మ్యాపింగై, నాటి ఓటర్ల జాబితాలో పేరు ఉన్నట్లయితే అలాంటి వారికి సులభంగానే తిరిగి ఓటుహక్కు లభిస్తుంది. అలాకాకుండా 2002 జాబితాలో పేరు లేకపోయినా, ఇప్పుడు కొత్తగా ఓటు హక్కు పొందాలన్నా భారత పౌరుడిగా నిరూపించుకోవాల్సిన అవసరం ఉంది. దీని కోసం కేంద్ర ఎన్నికల సంఘం 12 ధ్రువీకరణ పత్రాలను పొందుపరిచింది. వాటిలో ఏదో ఒకటి కలిగి ఉన్నా భారత పౌరుడిగా గుర్తింపు పొంది, ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకుని ఓటు హక్కు పొందే అవకాశం లభిస్తుంది.

### విదేశీ ఓటర్ల ఏరివేత.. డబ్లింగ్‌కు అడ్డుకట్ట ‘సర్’

ప్రక్రియ ప్రధాన ఉద్దేశం విదేశాలకు చెందిన ఓటర్లను ఏరివేయడంతోపాటు. డబ్లింగ్లను అరికట్టడం. ఇదే సమయంలో అర్హులైన అందరికీ ఓటుహక్కు కల్పించడం. ఎట్టి పరిస్థితుల్లోనూ భారతీయ పౌరుడై ఉండి, అర్హత కలిగి




ఉంటే అలాంటివారికి ఖచ్చితంగా ఓటుహక్కు లభిస్తుంది. ఇందులో ఎటువంటి ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తున్న సిబ్బంది సందేహానికి తావు లేదు. అయితే అదే సమయంలో విదేశాలకు చెందిన ఓటర్లను ఏరివేయడంతోపాటు, డబ్లింగ్ ఓటర్లను ఏదో ఒక చోటే అనుమతిస్తారు. మిగిలినచోట్ల తీసివేస్తారు. కొంత మంది ఒకటి కంటే ఎక్కువచోట్ల ఓటుహక్కు కలిగి ఉన్నారు. అలాంటి వాటిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా, ఏదో ఒకచోట మాత్రమే ఓటు ఉంచుతారు.

### 2004 తర్వాతపుట్టినవారికి తల్లిదండ్రుల ధ్రువీకరణ తప్పనిసరి

2004 సంవత్సరం తర్వాత పుట్టిన వారు ‘సర్’ ప్రక్రియలో తల్లిదండ్రుల ధ్రువీకరణను తప్పనిసరిగా సమర్పించాలి. ప్రస్తుతం 2002 నాటి ‘సర్’ డేటాతో మ్యాపింగ్ జరుగుతోంది. అంటే 2002 నాటి ఓటర్ల జాబితాలో పేరు కలిగి ఉండాలంటే అప్పటికి వారి వయసు 18 సంవత్సరాలు నిండి ఉండాలి. అంటే అప్పటికే 18 సంవత్సరాలు నిండినట్లయితే, 2002 నుంచి 2026 వరకు 24 సంవత్సరాలను కలిపితే అలాంటి వారి వయసు ప్రస్తుతం 42 సంవత్సరాలు ఉంటుందనేది సుస్పష్టం, అంటే ప్రస్తుతం 42 సంవత్సరాల వయసు దాటిన వారికి ఓటు హక్కు సులభతరంగానే లభిస్తుంది.

### కోడళ్లకు తప్పని ఇబ్బందులు

సర్ ప్రక్రియలో ప్రధానంగా కోడళ్లుగావచ్చిన వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎందుకంటే వివాహం చేసుకుని పుట్టింటి నుంచి అత్తవారింటికి వచ్చిన వారికి ఇక్కడ ఓటు హక్కుతోపాటు, అక్కడా ఓటు హక్కు ఉండే అవకాశం ఉంది. అలాగే వారి తల్లిదండ్రుల ధ్రువీకరణలో ఇక్కడ మ్యాపింగ్ కావు. వారు వేరేచోట ఓటర్లుగా ఉంటారు. ప్రస్తుతం కోడలుగాఉన్న ప్రాంతంలో మ్యాపింగ్‌కు ఇబ్బంది ఎదురవుతోంది. 18 నుంచి 40 సంవత్సరాల వయసులోపుగల కోడళ్లు కచ్చితంగా వారి తల్లిదండ్రులు, వారి స్వగ్రామం, మండలం వివరాలు బిఎల్వోలకు ఇవ్వవలసి ఉంటుంది. అలాగే 2004 తర్వాత పుట్టిన వారు కూడా వారి తల్లిదండ్రుల ధ్రువీకరణను సమర్పించాలి. పూర్తి చేసిన ఫారాలను బిఎల్ఏలు కలెక్ట్ చేయవచ్చు. ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను ఇవ్వాల్సిన బాధ్యత బూత్ లెవెల్ ఆఫీసర్లది కాగా, పూర్తి చేసిన ఫారాలను ఓటర్ల నుంచి తిరిగి కలెక్ట్ చేసి బిఎల్వోలకు సమర్పించే అవకాశం రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవెల్ ఏజెంట్లకు కల్పించారు. జూన్ 15 నుంచి ప్రారంభమైన ఈ సర్ ప్రక్రియలో జూలై 14 వరకు ఇంటింటికీ తిరిగి ఫారాలు అందజేయడంతో పాటు, పూర్తి చేసినవి తిరిగి కలెక్ట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఒక్కో పోలింగ్ బూత్‌లోనూ సగటున 1200 మంది వరకు ఓటర్లు ఉన్నారు. 30 రోజులలో ఈ ప్రక్రియ పూర్తి చేయాలంటే రోజుకు కనీసం 40 మంది ఓటర్లను కలిసి ఫారాలు ఇవ్వవలసి ఉంటుంది. తిరిగి వారు పూర్తిచేసినవి సకాలంలో కలెక్ట్‌చేసుకోవాలి. బూత్‌లెవెల్ ఏజెంట్లు రోజుకు గరిష్ఠంగా 50 ఫారాలవరకు సేకరించి బిఎల్వోలకు సమర్పించవచ్చు. బిఎల్వోలు వాటినిపరిశీలించి డిజిటలైజేషన్ చేస్తారు.

### జూలై 21న ముసాయిదా...

సెప్టెంబర్ 22న తుది ఓటర్ల జాబితా ప్రచుర ప్రస్తుతం కొనసాగుతున్న సర్ ప్రక్రియలో ఎన్నికల సంఘం నిర్దిష్ట ప్రణాళికను రూపొందించింది. జూన్ 15 నుంచి జూలై 14 వరకు ఇంటింటి సర్వే జరుగుతుంది. జులై 21న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తుంది. దీనిపై ఎవరికైనా ఏమైనా అభ్యంతరాలు ఉంటే జులై 21 నుంచి ఆగస్టు 20 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్లను స్వీకరిస్తుంది. వాటిని సమగ్రంగా పరిశీలించి సెప్టెంబర్ 22వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తుంది. ఈ విధంగా ఈ సర్‌ప్రక్రియ సుదీర్ఘంగా 130 రోజుల వరకు కొనసాగుతుంది. కాబట్టి ఓటరు ప్రతి దశలోనూ చాలా అప్రమత్తంగా ఉండి ఓటర్ల జాబితాలో తన పేరు ఉందో లేదో ఎప్పటికప్పుడు సరిచూసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. మొత్తానికి పశ్చిమ బెంగాల్ అనుభవం నేపథ్యంలో ఓటర్లలో కొంతవరకు అభద్రతాభావం నెలకొన్నప్పటికీ, ఎట్టి పరిస్థితుల్లోనూ అర్హులందరికీ ఓటు హక్కు కల్పించేలా ఎన్నికల సంఘం మార్గదర్శకత్వంలో యంత్రాంగం శ్రమిస్తోంది. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటర్లజాబితాలో నమోదయ్యేలా చూడాలని టేక్మాల్ తహశీల్దార్ తులసిరాం అన్నారు. సర్ కార్యాక్రమంలో పాల్గొనే అధికారులకు ప్రజలు సహకరించాలన్నారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి, అనర్హులు ఉంటే తొలగించాలన్నారు.

# దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి

-మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మైనంపల్లి హనుమంతరావు

**చిన్నశంకరంపేట, జూన్ 29, ప్రభాతవార్త:**
నూతన ఆలయాల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. సోమవారం మండల పరిధి కామారం తండాలో ఆంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామి దయతో వర్షాలు సమృద్ధిగాకురిసి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్‌ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు అనేకసంక్షేమ పథకాలను అమలుచేస్తుందని, పూర్వీకుల ఆచారసంప్రదాయాలకు అనుగుణంగా దేవాలయాల అభివృద్ధి, నూతన ఆలయాల నిర్మాణాలకు కృషి చేస్తుందన్నారు. అనంతరం ఆలయకమిటీ సభ్యులు మైనంపల్లి హనుమంతరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీమండలాధ్యక్షుడు, సర్పంచి మోహన్ నాయక్, మాజీ జడ్పిటిసి పోతరాజు రమణ, గోపాల్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక చింతన అవసరం

-మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి



విగ్రహప్రతిష్ఠ కార్యక్రమంలో ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్న పద్మారెడ్డి

**చిన్నశంకరంపేట, జూన్ 29, ప్రభాతవార్త:**
ఆధ్యాత్మికచింతన ప్రతి ఒక్కరికి అవసరమని మెదక్ మాజీఎమ్మెల్యే పద్మారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధి కామారం తండాలో ఆంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అలాగే బిఆర్‌ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి విగ్రహప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పి వైస్‌చైర్మన్ లావణ్యరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు రాజు, సర్పంచి మోహన్‌నాయక్, యాదగిరి, లక్ష్మణ్, హెమచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్‌రహిత సమాజాన్ని నిర్మిద్దాం

-సర్పంచి సబితాగౌడ్



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న సర్పంచి సబితాగౌడ్

**చిన్నశంకరంపేట, జూన్ 29, ప్రభాతవార్త:**
ప్లాస్టిక్‌రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని అంబాజీపేట సర్పంచి సబితాగౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం తడి చెత్త-పొడిచెత్తపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. భావితరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలన్నారు. గ్రామంలో మురికి కాలువలను, నీటి ట్యాంకులను శుభ్రంచేయిస్తూ గ్రామస్థులకు స్వచ్ఛమైన నీటిని అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. గ్రామస్థులు పారిశుధ్య కార్మికులకు తడిచెత్తను, పొడిచెత్తను వేరుచేసి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రజనికాంత్, ఉపసర్పంచి రాజు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధన

-ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్



జంగరాయితండాలో ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభిస్తున్న దృశ్యం

**చిన్నశంకరంపేట, జూన్ 29, ప్రభాతవార్త:**
ప్రభుత్వ పాఠశాలలోనే అనువజ్ఞులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్య అందుతుందని జంగరాయితండా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్ అన్నారు. సోమవారం పాఠశాలలో ప్రీప్రైమరీ తరగతులను కాంప్లెక్స్ హెచ్‌ఎం మనీష్‌రెడ్డి, సర్పంచి మంజూలాతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సౌజన్య, పాలకవర్గసభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సహకార సంఘం వారోత్సవాలు



సహకార సంఘం వారోత్సవాలను జరుపుకున్న దృశ్యం

**చిన్నశంకరంపేట, జూన్ 29, ప్రభాతవార్త:**
సహకారసంఘాల వారోత్సవాలను ఆయా సహకారసంఘాల కార్యాలయాల వద్ద ఘనంగా జరుపుకున్నారు. మండల పరిధి జంగరాయి, మడూర్, చందంపేట, చిన్నశంకరంపేట సహకార సంఘాల వద్ద సిఈవోలు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సహకారసంఘం పర్యవేక్షణ అధికారి మోహన్ పాల్గొన్నారు.

# మృతుని భార్యకు ఆర్థిక సహాయం

**వెల్దుర్తి, జూన్ 29, ప్రభాతవార్త:**
మండలకేంద్రానికి చెందిన పానుగంటి మైసయ్య పిడుగుపాటుతో మృతి చెందడం వల్ల సోమవారం కాంగ్రెస్‌నాయకులు మృతుని భార్య పానుగంటి లక్ష్మికి ఆర్థికసహాయాన్ని అందించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి సుధాకర్‌గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, నాయకులు కిష్టగౌడ్, కృష్ణశేఖర్‌గౌడ్, వారితో పాటు పలువురు పాల్గొన్నారు.

# మున్సిపల్ సమావేశంలో కీలక తీర్మానాలకు ఆమోదం

-పాల్గొన్న ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్, తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మున్సిపల్ ఛైర్మన్

**నారాయణఖేడ్, జూన్ 29, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ ఛైర్మన్ నగేష్ శెట్కార్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ వి.ప్రశాంతి, మున్సిపల్ వైస్ ఛైర్మన్, కౌన్సిలర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో మున్సిపల్ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించి, వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ప్రధానంగా ప్రధానమంత్రి ఆవాస్‌యోజన కింద లబ్ధిదారులకు నిధుల మంజూరు, మున్సిపల్‌పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు పరిపాలనా అనుమతులు, 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలు, పారిశుధ్య నిర్వహణ, మౌలిక వసతుల అభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీలు, స్ట్రీట్ లైట్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు తదితర అంశాలకు ఆమోదం తెలిపారు. అదేవిధంగా పట్టణ ప్రజలకు మెరుగైన పౌరసేవలు అందించేదిశగా పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సభ్యులు తమ అభిప్రాయాలు వెల్లడించగా, ప్రజలకు ఉపయోగపడేనిర్ణయాలను సమావేశం ఆమోదించింది. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ నగేష్ శెట్కార్, ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవ్‌రెడ్డిలు మాట్లాడుతూ, నారాయణఖేడ్ మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం పూర్తిసహకారం అందిస్తుందని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి కొనసాగుతుందని తెలిపారు. మున్సిపల్ ఛైర్మన్ నగేష్ శెట్కార్ మాట్లాడుతూ ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేస్తామని అన్నారు.

# రామాయంపేట సిహెచ్‌సిలో పల్స్‌పోలియో

-చిన్నారులకు పోలియోచుక్కలు వేసిన మెదక్ ఎమ్మెల్యే



పోలియోచుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

**రామాయంపేట, జూన్ 29, ప్రభాతవార్త:**
రామాయంపేట పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సిహెచ్‌సి) హాస్పిటల్‌లో సోమవారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్యే డా.మైనంపల్లి రోహిత్ స్వయంగా పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 5ఏళ్లలోపు ఏ ఒక్క చిన్నారి కూడా పోలియోచుక్కలు వేసుకోకుండా మిగిలిపోకూడదు. వైద్యుడిగా నాకు పోలియో ప్రమాదం తెలుసు. మెదక్ నియోజకవర్గాన్ని పోలియోరహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు. డిఎంహెచ్‌వో మాట్లాడుతూ, రామాయంపేట మండలంలో ఇంటింటి సర్వే ద్వారా అందరు చిన్నారులకు చుక్కలు వేస్తున్నామని, బస్టాండ్, ప్రధాన కూడళ్లలో ప్రత్యేకబూత్‌లు ఏర్పాటుచేశామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు పల్స్ పోలియోపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డిఎంహెచ్‌వో), హాస్పిటల్ సూపరింటెండెంట్, డిసిహెచ్‌ఎస్ డా.శివదయాల్, రామాయంపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ గజవాడ లావణ్యానాగరాజు, వైస్ ఛైర్‌పర్సన్ పోచమ్మల నవనీత గణేష్, కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, దేవుని రంజిత్, మండల కాంగ్రెస్‌నాయకులు, కార్యకర్తలు, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

**నర్సాపూర్, జూన్ 29, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం 46 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఏర్పాటుచేసుకొని ఒకరినొకరు కలుసుకున్నారు. నర్సాపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1979-80 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు పట్టణ సమీపంలోని అర్బన్‌పార్కులోని కాటేజీలో సమావేశం ఏర్పాటుచేసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో కొత్త గంగాధర్, చౌటి జగదీశ్వర్, షణ్ముఖచారి, మోహన్‌రెడ్డి, రామారావు, దన్‌సింగ్, విజయ్‌కుమార్, బ్రహ్మచారి, అంజాగౌడ్, పి.కృష్ణ, కె.కృష్ణ, సలాహుద్దీన్, యాదగౌడ్, ఎస్.రాములు, అన్నపూర్ణ, అనురాధ, శోభారాణి, సరళరాణి తదితరులు పాల్గొనగా, పూర్వవిద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు గోపి పాల్గొన్నారు. ఉపాధ్యాయులు గోపిను శాలువాతో సన్మానించారు.

# వర్షాలతో ఇబ్బందులు కలుగకుండా చూడాలి

-మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీ రాజుయాదవ్



నీరుచేరిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్, కమిషనర్

**నర్సాపూర్, జూన్ 29, ప్రభాతవార్త:**
కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీరాజుయాదవ్ అధికారులను ఆదేశించారు. ఆదివారంరాత్రి కురిసిన భారీవర్షానికి పట్టణంలోని ఆరోవార్డులో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. నీరు చేరిన ప్రాంతాన్ని మున్సిపల్ కమిషనర్ చెరుకు సాయి కుమార్‌తో కలిసి మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాచునూరి లక్ష్మీరాజుయాదవ్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, సమస్యకు శాశ్వత పరిష్కారంగా నూతనంగా మురికికాలువ నిర్మాణం లేదా అండర్‌గ్రౌండ్ నిర్మాణం చేయుటకు మున్సిపల్ ఇంజనీర్ విభాగాన్ని ఆదేశించడమైనది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ కిష్టయ్య, వార్డు అధికారులు రాములు, ఉదయ్‌కుమార్, పవిత్ర, సానిటరీ ఇంచార్జ్ సల్ల మురళి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడిపై బెదిరింపుల కేసు

**జూబ్లీహిల్స్, జూన్ 29, ప్రభాతవార్త:**
జూబ్లీహిల్స్‌లోని జర్నలిస్టుల కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు బ్రహ్మాండభేరి గోపరాజుపై జూబ్లీహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. సొసైటీ ఆర్థిక వ్యవహారాలపై ప్రశ్నించినందుకు తనను అసభ్యపదజాలంతో దూషించి, చంపేస్తామని బెదిరించారని కోశాధికారి భీమగాని మహేశ్వర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే డ్రైవర్ గోపాల్‌తో కలిసి పలుమార్లు చంపేస్తానంటూ భయభ్రాంతులకు గురిచేశారని, గుర్తుతెలియని వ్యక్తులను సొసైటీ కార్యాలయానికి తీసుకువచ్చి భయాందోళనలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కోర్టు అనుమతి అనంతరం జూబ్లీహిల్స్ పోలీసులు బిఎన్‌ఎస్ సెక్షన్ 351(2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా ఎల్లమ్మ కళ్యాణోత్సవం..



ఎల్లమ్మ కళ్యాణంలో పాల్గొన్న భక్తులు

**వెల్దుర్తి, జూన్ 29, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన వెల్దుర్తిలో వెలసిన శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో 11వ వార్షికోత్సవంలో భాగంగా రెండవరోజు సోమవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో గణపతిహోమం నిర్వహించి ఘనంగా పూజనిర్వహించారు. మధ్యాహ్నం ఎల్లమ్మకళ్యాణం అంగరంగవైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అలాగే ఒడిబియ్యాలను పోసి మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి విశేషపూజ నిర్వహించారు. దీంతో గౌడకులస్తులతో పాటు ఇతర భక్తులు పాల్గొన్నారు.

# బూత్‌లలో ఎస్ఐఆర్ ధృవీకరణ పరిశీలన

**చిక్కడపల్లి, జూన్ 29, ప్రభాతవార్త:**
ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా ప్రక్షాళన (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా సోమవారం గాంధీనగర్ డివిజన్ పరిధిలోని బూత్ నంబర్లు 14,15,16లలో జరుగుతున్న ఓటర్ల ధృవీకరణ ప్రక్రియను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. మారిశెట్టి నర్సింగ్‌రావు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరిపేరు ఓటర్లజాబితాలో ఉండేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ధృవీకరణ ప్రక్రియలో పారదర్శకత పాటించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని కోరారు. ప్రజలు కూడా తమ వివరాలను పరిశీలించి అవసరమైన పత్రాలను సమర్పించి సహకరించాలని సూచించారు. గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బింగి సాయి కీర్తి (బాబ్జీ), కాంగ్రెస్ నాయకులు భాస్కర్‌రెడ్డి, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వరకట్న వేధింపు కేసులో జైలుశిక్ష

**అల్వాల్, జూన్ 29, ప్రభాతవార్త:**
వరకట్న వేధింపు కేసులో ఓవ్యక్తికి మల్కాజిగిరి జిల్లా ప్రధాన సెషన్స్ న్యాయమూర్తి జైలుశిక్ష విధించారు. అల్వాల్ పోలీసుస్టేషన్‌లో 2020లో వరకట్న వేధింపుల కేసు నమోదైంది. ఓల్డ్ అల్వాల్ రిట్రీట్‌కాలనీ సాయిశ్రీనివాస్ అపార్ట్‌మెంట్‌లో నివసించే చెరుకు రోహిత్ కుమార్(39) భార్యను అదనపు కట్నం వేధించిన నేపథ్యంలో ఆయనపై కేసు నమోదైంది. ఆరు సంవత్సరాలుగా సాగిన విచారణ అనంతరం జిల్లా ప్రధాన సెషన్స్ న్యాయమూర్తి రోహిత్‌కుమార్‌కు 1 సంవత్సరం 6 నెలలు సాధారణ కారాగార శిక్షతో పాటుగా 10వేలు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

# చోరీకేసును మూడుగంటల్లో ఛేదించిన పోలీసులు

-నర్సాపూర్ పోలీసులను అభినందించిన ఉన్నతాధికారులు




చోరీకేసు వివరాలను వెల్లడిస్తున్న సిఐ రంగాకృష్ణ, ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డి

**నర్సాపూర్, జూన్ 29, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణంలోని సంగారెడ్డి రోడ్డు మార్గంలో గల ఫ్లిప్కార్ట్, షాడో ఫాక్స్ టెక్నాలజీస్ కార్యాలయంలో జరిగిన చోరీ కేసును నర్సాపూర్ పోలీసులు మూడు గంటల్లో ఛేదించారు. ఈ కేసులోఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని చోరీ సొత్తును స్వాధీనంచేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం సిఐ రంగాకృష్ణ నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. మెదక్ పట్టణానికి చెందిన మేడి శ్రీధర్ (46) రేడియంట్ క్యాష్ మేనేజ్మెంట్ సర్వీస్‌లో క్యాషియర్‌గా పనిచేస్తూ, నర్సాపూర్ ప్రాంతంలోని అమెజాన్, ఫ్లిప్కార్ట్, మీషో, షాడో ఫాక్స్ టెక్నాలజీస్ సంస్థల నుండి రోజువారీ నగదు సేకరణ బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. బ్యాంకులకు ఈనెల 26నుండి మూడురోజులవరకు సెలవులు ఉండటంతో ఫ్లిప్కార్ట్, షాడో ఫాక్స్ టెక్నాలజీస్ కార్యాలయంలో మూడు రోజుల నగదు నిల్వ ఉందని తెలుసుకొని, దానిని దొంగతనం చేయాలని పథకం పన్నాడు. ఈ క్రమంలో తనబంధువు సాయిని రవి(41) టిఫిన్ సెంటర్ వ్యాపారి, ఫతేనగర్, మెదక్ నివాసితో కలిసి కుట్ర పన్ని, ఆదివారం అర్ధరాత్రి సమయంలో నర్సాపూర్‌కు వచ్చి కార్యాలయం వెనుక తలుపులను బలవంతంగా తెరిచి లోపలికి ప్రవేశించారు. అనంతరం సిసిటివి కెమెరాలను ఆఫ్ చేసి, కార్యాలయంలోని రూ.2,66,850/ నగదు, సిసిటివి డివిఆర్‌ను దొంగిలించి, తమ స్కూటీతో మెదక్‌కు వెళ్లిపోయారు. సోమవారం నిందితులు దొంగిలించిన నగదుతో హైదరాబాద్ వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా, నర్సాపూర్ చౌరస్తావద్ద పోలీసులు అనుమానాస్పదంగా కనిపించిన టివిఎస్ స్కూటీని ఆపి తనిఖీచేయగా, వారి వద్ద నుండి రూ.2,66,850/ నగదు, హైక్ విజన్ కంపెనీకి చెందిన డివిఆర్, చోరీకి ఉపయోగించిన నెంబర్‌ప్లేట్ లేని టివిఎస్ స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు డివిఆర్ లోని సిసిటివి ఫుటేజీని సేకరించి, నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ చోరీకేసును మూడుగంటల్లో ఛేదించిన నర్సాపూర్ పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు. కార్యక్రమంలో ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

# కట్టమైసమ్మ దేవాలయంలో రుద్రసహిత చండీహోమం

**ముషీరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:**
లోయర్ ట్యాంక్‌బండ్‌పైనున్న శ్రీకనకాల కట్టమైసమ్మ దేవాలయంలో శ్రీరుద్రసహిత చండీహోమం అత్యంతవైభవంగా నిర్వహించారు. సోమవారం జ్యేష్టపౌర్ణమి సందర్భంగా ప్రత్యేకపూజలు, హోమం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు సాత్విక్‌శర్మ తెలిపారు. హోమం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాలలో ఆలయచైర్మన్ గోల్కొండ గౌతం కుమార్‌పటేల్, కార్యనిర్వాహణాధికారి మహేందర్‌గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

# త్యాగరాయ గానసభలో నయనానందకరంగా నాట్య రంజని

**చిక్కడపల్లి, జూన్ 29, ప్రభాతవార్త:**
చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళావేదికపై శ్రీరామ జయరామ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన నాట్యరంజని శాస్త్రీయ నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. వివిధ వాగ్గేయకారుల కీర్తనలకు అనుగుణంగా ఎస్ఆర్ఎస్ డాన్స్ అకాడమీకి చెందిన జ్యోతిర్మయి శిష్యబృందం ఆకట్టుకునే నృత్య ప్రదర్శనలు ఇచ్చింది. గాయనులు శిరీష, వాణి, ధనలక్ష్మి తదితరులు ఆలపించిన కీర్తనలు సభికులను అలరించాయి. ఈసందర్భంగా సంస్థవ్యవస్థాపకుడు కుడికల మల్లేశ్ మాట్లాడుతూ ప్రతిభావంతులైన బాల, యువ నృత్య-సంగీత కళాకారులను ప్రోత్సహించడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సహ వ్యవస్థాపకులు శివపార్వతి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ మాట్లాడుతూ చిన్ననాటినుంచే పిల్లలకు కళలలో శిక్షణ ఇవ్వడం ద్వారా సంస్కారం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని అన్నారు. కళలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు వినయ్‌కుమార్, కళాభిమాని రామమోహనరావు, పలువురు కళాకారులు, తల్లిదండ్రులు, ప్రేక్షకులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆద్యంతం కళారసికులను అలరించింది.

# వినియోగదారులకు నాణ్యమైన సేవలు

**యూసుఫ్‌గూడ, 29 జూన్, ప్రభాతవార్త:**
వినియోగదారులకు తమ వంతుగా నాణ్యమైన సేవలు అందించేం దుకు ఆశీర్వాద్ మైక్రో ఫైనాన్స్ లిమిటెడ్ సిబ్బంది అన్నివిధాల కృషిచేయటం జరుగుతుందని ఆసంస్థ సీఈవో జీడీ.మనోజ్ పాసంగా అన్నారు. సోమవారం మోతీనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది కష్టపడి సంపాదించుకున్న బంగారాన్ని తమపై నమ్మకంతో ఆశీర్వాద్ మైక్రో ఫైనాన్స్ కంపెనీలో దాచుకుంటారని వారికి అందించే గోల్డ్ లోన్ సంతృప్తికరంగా ఉండేలా తాము తమబాధ్యతగా అందివ్వడం జరుగుతుందన్నారు. దీనితో పాటు ఆన్‌లైన్ యాప్ ద్వారా గోల్డ్ లోన్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. తమ సంస్థ తరపున పలు సేవా కార్యక్రమాలలో భాగంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు, బుక్కులను పంపిణీ చేయటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజినెస్ హెడ్ ముత్తు భాస్కర్, బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్‌రావు, నరసింహా, ఏరియా మేనేజర్ అనీప్ బుజ్జి, బ్రాంచ్ హెడ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# నేడు టిడి జనార్దన్‌కి ఎన్టీఆర్ పురస్కార ప్రదానం

**చిక్కడపల్లి, జూన్ 29, ప్రభాతవార్త:**
తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు టిడి.జనార్దన్‌కు ఎన్టీఆర్ పురస్కార ప్రదానం చేయనున్నట్లు రసమయి సంస్థ అధ్యక్షులు, ప్రముఖ కవి డాక్టర్ ఎం.కె.రాము తెలిపారు. మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు హాజరై ఈ పురస్కారాన్ని జనార్దన్‌కు అందజేస్తారన్నారు. హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో మాజీకేంద్రమంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి, విశ్రాంత ఇన్‌కంటాక్స్ చీఫ్ కమిషనర్ యం.నరసింహప్ప, తెలుగువన్.కామ్ ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ కంఠమనేని రవిశంకర్ ఈ సందర్భంగా డాక్టర్ ఎం.కె.రాము రచించిన నందమూరి నవోదయం సంగీత నృత్యోత్సవంలో భాగంగా జరిగే నృత్య రూపకంలో స్థానిక బాలికలు, నృత్య కళాకారిణులు ప్రదర్శనలు ఇవ్వనున్నారు.

# జానపద కళాప్రదర్శనలతో దద్దరిల్లిన తెలంగాణ ప్రజాకళ

**రవీంద్రభారతి, జూన్ 29 ప్రభాతవార్త:**
తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రాంగణంలోని పాల్కురికి సోమన్న (ఘంటసాల కళామందిరం) ఆరుబయలు కళావేదికలో సంచాలకుడు డా.ఏనుగు నరసింహారెడ్డి నేతృత్వంలో 99రోజులపాటు నిర్విరామంగా జరుగుతున్న సాంస్కృతిక మహోత్సవం తెలంగాణ ప్రజాకళ 89వరోజు జరిగిన వివిధ జానపద కళాప్ర దర్శనలతో దద్దరిల్లింది. ముందుగా నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన పద్మబృందం తెలంగాణ మట్టివాసనను, పల్లెజీవనాన్ని ప్రతిబింబించే కళాకారులు ఆడిపాడిన జానపద పల్లెపాటలు పట్టణ ప్రేక్షకులను మైమరపించాయి. ఇక మెదక్ జిల్లాకు చెందిన రౌంజా వాయిద్య గంభీర ధ్వనుల అర్జున్ కళాకారుల బృందం కనీవినీ ఎరుగనిరీతిలో ఒకపక్క వీరత్వానికి, మరోపక్క భక్తికి ప్రతీకకగా నిలిచే రౌంజా వాయిద్యంతో ఆహుతులను మంత్రముగ్ధులను చేశారు. ఈ సందర్భంగా జరిగిన తెలంగాణ ప్రజాకళ సాంస్కృతిక మహోత్సవ సభాకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా.ఏనుగు నరసింహారెడ్డి విశిష్ట అతిథులు పి.నర్సింలు, డా. పి.విజయ్‌కుమార్, ముచ్చర్ల దినకర్ తదితరులతో కలిసి కళాకారులను ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు.

# రూ.14 లక్షల మోసం.. నకిలీ నోట్లతో టోకరా

**జూబ్లీహిల్స్, జూన్ 29, ప్రభాతవార్త:**
రుణం ఇప్పిస్తానని నమ్మించి డబ్బులు కాజేయడమే కాకుండా నకిలీ నోట్లతో టోకరా వేసేందుకు ప్రయత్నించిన ఒక ప్రబుద్ధుడిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. వ్యాపారవేత్త నరాలశెట్టి ప్రసన్నకుమార్‌కు తనకు తెలిసిన వ్యక్తుల ద్వారా నరేష్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. రుణం ఇప్పిస్తానని నమ్మించి 2024 నుంచి విడతల వారీగా రూ.14 లక్షలు తీసుకున్నాడు. అనంతరం డబ్బులు తిరిగి ఇస్తానిచెప్పి చిల్డ్రన్స్ బ్యాంక్ పేరుతో నకిలీ కరెన్సీ నోట్లను ఇచ్చాడు. గతంలోనూ రూ.10 లక్షల నకిలీ డిమాండ్ డ్రాఫ్ట్ ఇచ్చాడని ప్రసన్నకుమార్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. డబ్బులు అడిగితే అసభ్య పదజాలంతో దూషిస్తూ, చంపేస్తానంటూ బెదిరింపులకు పాల్పడుతున్నడని అందులో తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్లు 316(2), 318(4), 308(5), 351(2) కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఖైరతాబాద్ పోస్టాఫీసులో చోరీయత్నం

**జూబ్లీహిల్స్, జూన్ 29, ప్రభాతవార్త:**
ఖైరతాబాద్ పోస్టాఫీసులో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించిన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 25న రాత్రి 9గంటలకు కార్యాలయం మూసివేసి పోస్టాఫీసు సిబ్బంది వెళ్లిపోయారు. మరుసటిరోజు మొహర్రం సెలవుకావడంతో పోస్టాఫీసు తెరవలేదు. 27న స్వీపర్ ఉమపై అంతస్తును శుభ్రం చేస్తుండగా పీఎల్ఐ విభాగంలోని అల్మారా నేలపై పడిపోయి ఉండటం, అకౌంట్స్ సెక్షన్, స్టాక్ బ్రాంచ్ డ్రాయర్లు తెరిచి ఉండటాన్ని గమనించి సమాచారం ఇచ్చింది. సిబ్బంది కార్యాలయాన్ని పరిశీలించగా నగదు లేదా ఇతరవస్తువులు చోరీకి గురికాలేదని నిర్ధారించుకున్నారు. అనంతరం సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించగా దుండగులు గోడలోని గాలి వెంటిలేటర్ ద్వారా లోపలికి ప్రవేశించినట్లు గుర్తించారు. చోరీకియత్నించిన గుర్తుతెలియని వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పోస్టల్ అసిస్టెంట్ అమర్ సింగ్ ఫిర్యాదు చేయగా ఖైరతాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రూ. 62వేల చీరలతో పరారైన పోర్టర్ డ్రైవర్

**జూబ్లీహిల్స్, జూన్ 29, ప్రభాతవార్త:**
ఆన్‌లైన్ లాజిస్టిక్స్ సంస్థ అయిన పోర్టర్ యాప్ ద్వారా బుక్‌చేసిన రూ.62 వేల విలువైన చీరలను డెలివరీ చేయకుండా డ్రైవర్ పరారైన ఘటనపై పంజా గుట్ట పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకొంది. పంజాగుట్ట పోలీసు కథనం ప్రకారం.. రాహుల్ అనే డ్రైవర్ ఏప్రిల్ 6న పోర్టర్‌యాప్ ద్వారా భాగస్వామిగా చేరాడు. ఈ నెల 14న ఓ కస్టమర్ రూ.22 వేల విలువైన రెండు చీరలు, జూన్ 15న మరో కస్టమర్ రూ.40 వేల విలువైన నాలుగు చీరలను రవాణా చేయాలని యాప్‌లో బుకింగ్‌చేశారు. నార్సింగిప్రాంతంలో సరుకును స్వీకరించిన రాహుల్, షేక్‌పేట్‌లోని గమ్యస్థానానికి వాటిని చేరవేయకుండా మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి పరారయ్యాడు. కంపెనీ ప్రతినిధులు, వినియోగదారులు పలుమార్లు సంప్రతించినా స్పందించలేదు. ఈ ఘటనతో కస్టమర్లకు రూ.62వేల నష్టం వాటిల్లడమే కాకుండా సంస్థ ప్రతిష్ఠకు కూడా భంగంకలిగిందని సంస్థ ప్రతినిధి బండే మనోహర్‌రెడ్డి ఫిర్యాదు పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదుచేశారు. వెంటనే డ్రైవర్‌ఖాతాను యాప్‌నుంచి నిలిపివేసినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న బాల్‌నర్సయ్య

## పంచాయతీ కార్మికులకు ప్రతి నెల 1న జీతాలు ఇవ్వాలి

### సిఐటియు జిల్లా అధ్యక్షుడు అమ్ముల బాల్‌నర్సయ్య

**చిన్నకోడూరు, జూన్ 29, ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెల 1వ తేదీన జీతాలు చెల్లిస్తామని సిఎం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షుడు అమ్ముల బాల్‌నర్సయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం పంచాయతీ ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ గ్రామ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలలో భాగంగా పంచాయతీ కార్మికులను క్రమబద్ధీకరణచేసి కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వం చెల్లిస్తున్న వేతనాలు గ్రీన్ ఛానల్ ద్వారా కార్మికుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. జీవో నంబరు 51 సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలన్నారు. పంచాయతీ కార్మికులకు ప్రభుత్వమే గుర్తింపు కార్డులు, సబ్బులు, నూనెలు, శానిటేషన్ ఇతర సామాగ్రిని ఇవ్వాలన్నారు. ఈఎస్ఐ,పిఎఫ్ బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వల్లారపు తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్మికులు మల్లేశం, పద్మ, రాజమణి, లచ్చవ్వ, వెంకటవ్వ తదితరులు పాల్గొన్నారు.

## బొడ్రాయి ప్రతిష్ఠకు ఆహ్వానం



హరీష్‌రావుకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు

**మర్కుక్, జూన్ 29 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలో జూలై 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్న బొడ్రాయి ప్రతిష్ఠ, బోనాల మహోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ సోమవారం మాజీ మంత్రి హరీష్‌రావుకు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మర్కుక్ కరుణాకర్‌రెడ్డి, సర్పంచ్ రాణిమల్లేష్ ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డిసి మాజీచైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఉపసర్పంచ్ సాయిని మహేష్, గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, సంతోష్‌రెడ్డి, బబ్బూరి శ్రీనివాస్‌గౌడ్, పాపోళ్ల రాజు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## హైమాస్ట్ లైట్లకు ఎంపి నిధులు కేటాయిస్తా

### -ఎంపి రఘునందన్‌రావు



రఘునందన్‌రావుకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న సాయిరెడ్డి రాంరెడ్డి

**మర్కుక్, జూన్ 29 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాములపర్తి నుండి మర్కుక్ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా హైమాక్స్ లైట్ల ఏర్పాటుకు ఎంపి నిధులను కేటాయిస్తానని ఉమ్మడి మెదక్ జిల్లా ఎంపి మాధవనేని రఘునందన్‌రావు తెలిపారు. సోమవారం బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు సాయిరెడ్డి రాంరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు తాడూరి మహేష్ గౌడ్ పాములపర్తి, మర్కుక్ గ్రామాల్లో నిర్వహించనున్న బొడ్రాయి మహోత్సవ కార్యక్రమాలకు హాజరుకావాలని కోరుతూ ఎంపి రఘునందన్‌రావుకు ఆహ్వానపత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా బొడ్రాయి మహోత్సవ కార్యక్రమాలకు తప్పకుండా హాజరవుతానని ఎంపి తెలిపినట్లు వారు పేర్కొన్నారు. అలాగే అడిగిన వెంటనే హైమాక్స్ లైట్ల ఏర్పాటుకు నిధులను కేటాయించిన ఎంపికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మహేందర్, స్వామి, గణేష్, సురేష్, నితిన్ ఉన్నారు.

## గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : సర్పంచ్



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

**హుస్నాబాద్ రూరల్, జూన్ 29, ప్రభాతవార్త :** గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కుచనపల్లి గ్రామ సర్పంచ్ మడప పద్మజైపాల్ రెడ్డి అన్నారు. కుచనపల్లిలో రూ.33 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణ పనులకు సోమవారం ఆమె భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో కుచనపల్లి గ్రామానికి సీసీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణం కోసం రూ. 33 లక్షల ప్రత్యేక నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెన్న రాజు, పట్టణ అధ్యక్షుడు వి.వి. రమణ, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ బంక చందు, నాయకులు కొడముంజ మహేందర్, కూరెళ్ల సంతోష్, ఇంద్రాల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలను అధికారుల తనిఖీ

**మొగుడంపల్లి, జూన్ 29 ప్రభాతవార్త :** మండలంలోని ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలను సోమవారం ఎంపీడీవో అంజలిదేవి, ఏపీఎం టిక్యానాయక్ కలిసి తనిఖీ చేశారు. హాస్టల్‌లోని మౌలిక వసతులు, భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పరిశుభ్రతతో కూడిన నాణ్యమైన ఆహారం అందించాలని హాస్టల్ సిబ్బందిని ఆదేశించారు. హాస్టల్ నిర్వహణలో సమస్యలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హిమాబిందు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

# అర్హులైనవారి ఒక్క ఓటు మిస్ కాకూడదు

### రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ రూరల్, జూన్ 29, ప్రభాతవార్త**

మండలంలోని పోతారం గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సంక్షిప్త సవరణ(సర్) కార్యక్రమాన్ని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఓలు, బీఎల్ఏలతో మాట్లాడిన మంత్రి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, నమోదు ప్రక్రియపై ఆరా తీశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఓటరు వివరాలను సరి చూసుకుని అవసరమైన పత్రాలతోపాటు కలర్ పాస్ పోర్ట్‌సైజ్ ఫోటోలను జతచేసి ఫారాలను సకాలంలో సమర్పించాలని సూచించారు. 2002లో చేపట్టిన ఓటరు సవరణప్రక్రియ తర్వాత మళ్లీ ఇప్పుడు జరుగుతోందన్నారు. అర్హులైన ఒక్క ఓటు తొలగి పోకుండా ప్రభుత్వం, ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటున్నాయని, ప్రస్తుతం కొందరు బీజేపీ వ్యక్తులు ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ప్రచారం చేస్తున్నారని, అలాంటి పరిస్థితి లేకుండా ప్రతి అర్హుడి ఓటు జాబితాలో ఉండేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి బీఎల్ఓలు వెళ్లి కుటుంబ సభ్యులందరికి విడివిడిగా ఎన్యూమరేషన్ ఫారాలు అందజేస్తారని, ప్రజలు రెండు ఫోటోలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. 2002, 2025 ఓటరు జాబితాలను పరిశీలిస్తూ ప్రస్తుత సవరణ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. తాత్కాలికంగా తటస్థ జాబితాలోకి వెళ్లిన ఓటర్లను తొలగించినట్టు కాదని, వారు సరైన ధ్రువపత్రాలు సమర్పిస్తే తిరిగి సాధారణ జాబితాలో చేరుస్తామని వివరించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో 2.5 లక్షల ఓటర్లు ఉండగా, 61 వేల ఓట్లు తటస్థ జాబితాలో ఉన్నాయని, జూలై 31న ముసాయిదా ఓటరుజాబితా విడుదల అవుతుందని, ఏవైనా సమస్యలు ఉంటే సర్పంచ్‌లు లేదా సంబంధిత అధికారులను సంప్రదించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

### హుస్నాబాద్‌లో ఆదర్శ హమాలీ సంఘం నూతన భవనం ప్రారంభం

హుస్నాబాద్‌లో రూ.10 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మించిన ఆదర్శ హమాలీ సంఘం నూతన భవనాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హమాలీ సంఘం ప్రతినిధులు, కార్మికులకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం, సామాజిక భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. హమాలీలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతోపాటు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. నూతన భవనం హమాలీ కార్మికుల సమావేశాలు, సంక్షేమ కార్యక్రమాలకు ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హమాలీ సంఘం సభ్యులు తమకు సౌకర్యవంతమైన భవనం ఏర్పాటు చేసినందుకు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ పద్మ, స్థానిక కౌన్సిలర్లు, హమాలీ సంఘం అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు ఉన్నారు.



నూతన పాటశాల భవనాన్ని ప్రారంభిస్తున ఎమ్మెల్యే సునీతలక్ష్మారెడ్డి

## విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: ఎమ్మెల్యే

**కొల్చారం, జూన్ 29 ప్రభాతవార్త:** మండలంలోని పోతంశెట్టిపల్లి, అప్పాజీపల్లి, కొల్చారం, రాంపూర్, రంగంపేట గ్రామాలలో ఫ్రీ ప్రైమరీ పాఠశాలలను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతలక్ష్మారెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంపూర్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ నెల్లి సంగమేశ్వర్ మాట్లాడుతూ పాఠశాల ప్రహరీగోడ నిర్మాణంతోపాటు సీసీ రోడ్లు, అంగన్వాడీ నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఉమారాణి, ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా బేగం, తహసీల్దార్ శ్రీనివాస్ చారి, మండల పార్టీ అధ్యక్షుడు గౌరీశంకర్, యువజన అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్‌రావు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అరిగె రమేష్, సర్పంచులు రవితేజరెడ్డి, ఆంజనేయులు, స్వామి, దయాకర్‌గౌడ్, నాయకులు ఇంద్రసేనారెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అరిగె విజయ్, చిట్కుల సురేష్, ప్రభాకర్, సోమ నర్సింలు, ఆరే రవీందర్, వెంకటరామిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీపై కంది విత్తనాలు

**రాయపోల్, జూన్ 29 (ప్రభాతవార్త):** మండలంలోని రైతులకు సబ్సిడీపై కందుల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి నరేష్ తెలిపారు. ఎల్ఆర్‌జి 133-33 రకం కందుల విత్తనాలను 4 కిలోల బ్యాగులలో పంపిణీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 4 కిలోల ఒక్కో బ్యాగు ధర రూ.520 కాగా, ప్రభుత్వ సబ్సిడీ అనంతరం రైతులు కేవలం రూ.280 చెల్లించి పొందవచ్చని వివరించారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని నరేష్ కోరారు.

## కేంద్ర ప్రభుత్వం రైతులపై మొండి వైఖరి వీడాలి : దశరథ్

**కొండాపూర్ జూన్ 29 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం రైతులపై మొండి వైఖరి వీడాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సిహెచ్ దశరథ్, సంజీవరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువుల ధరలను పెంచి పేద రైతుల నడ్డి విరుస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పెంచిన ఎరువుల ధరలను తగ్గించాలని ఎరువు బస్తాపై రూ.2000 పెంచడం ఎంతవరకు సమంజసం అన్నారు. పెట్రోల్ డీజిల్ కొరతలను సృష్టిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రధాని అంబానీల సంపాదన పెంచేందుకు బిజెపి పాలన సాగిస్తుందని ధ్వజమెత్తారు. దేశంలో రైతుల భద్రతను మోడీసర్కార్ గాలికివదిలేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతు భరోసా పథకం నిధులను బ్యాంకు ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో పేద ప్రజల బతుకులకు భద్రత లేకుండా పోతుందని ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రెహామాన్, శివరాములు, వడ్ల బ్రహ్మం,మల్లయ్య, జైపాల్, శివమ్మ, చంద్రయ్య, సాయన్న, ఏసమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్

## అయ్యప్ప ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి

### -నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో మున్సిపల్ చైర్మన్ చందన

**గజ్వేల్ టౌన్, జూన్ 29 (ప్రభాతవార్త):** అయ్యప్ప దేవాలయ నూతన కమిటీ ఆలయాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్ అన్నారు. సోమవారం స్థానిక హరిహరపుత్ర అయ్యప్పస్వామి దేవాలయం ఆవరణలో ఆలయ నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బొగ్గుల సురేష్, ఉపాధ్యక్షుడు జగ్గయ్యగారి శేఖర్, ప్రధాన కార్యదర్శి అయిత సత్యనారాయణ, సహాయ కార్యదర్శి గోపి, కోశాధికారి నారాయణరెడ్డి, కార్యవర్గ సభ్యులను పురోహితులు నందబాలశర్మ, మాజీ మున్సిపల్ చైర్మన్లు ఎన్‌సి.రాజమౌళి, గాడిపల్లి భాస్కర్, ఎలక్షన్ ఆఫీసర్స్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ చందన రవీందర్ మాట్లాడుతూ ఆలయాన్ని గత పాలకవర్గం కన్నా మరింత అభివృద్ధి చేసి చూపించాలని, భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పద్మాబాయి నర్సింగరావు, కౌన్సిలర్ శ్రీధర్, మాజీ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, నాయకులు దుర్గాప్రసాద్, సిద్ది బిక్షపతి, నంగునూరి సత్యనారాయణ, కైలాస ప్రభాకర్, మర్యాల శ్రీనివాస్, ఎన్‌బి. ప్రభాకర్, ఎన్‌సి.సంతోష్, భద్రయ్య, లింగోజి, రాంబాబు, ఆలయ కమిటీ సభ్యులు, శాశ్వత సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అహ్మదీపూర్ మీదుగా హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సు

**గజ్వేల్ టౌన్, జూన్ 29 (ప్రభాతవార్త):** సిద్దిపేట నుంచి అహ్మదీపూర్ మీదుగా హైదరాబాద్‌కు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సు సోమవారం ప్రారంభమైనట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ఈనెల 25న మంత్రి వివేక్ వెంకటస్వామికి, సంగారెడ్డి ఆర్ఎంకు సిద్దిపేటనుండి హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ బస్సు అహ్మదీపూర్ ఎక్స్ రోడ్డు నుంచి వెళ్లాలని వినతిపత్రం ఇవ్వడంతో సోమవారం నుండి బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆత్మ కమిటీ డైరెక్టర్ గజ్వేల్ రామచంద్రంరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శనిగరి మల్లేశం మాట్లాడుతూ గ్రామం నుండి విద్యార్థులు చదువుకోవడానికి గజ్వేల్ చుట్టుపక్కల ప్రాంతానికి, హైదరాబాద్ వెళ్లడం జరుగుతుందని, బస్సు లేక అవస్థలు పడుతున్నారని అన్నారు. గతంలో ఉదయం సాయంత్రం బస్సులు వచ్చేవని, ప్రస్తుతం రావడంలేదని ప్రజలు, విద్యార్థులు చెప్పగా మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా మంత్రి వివేక్‌తో మాట్లాడి సోమవారం నుంచి ప్రారంభం అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు ఆందోల్ నర్సింలు, పాల రామాగౌడ్, బాల్‌రాజుగౌడ్, రామచంద్రం, నరేందర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, బోయిని రామచంద్రం, శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, నరసింహారెడ్డి, వెంకట్రాంరెడ్డి, శనిగరి రాజు, కమ్మరి నాగార్జున్, అత్తెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

# అర్హత కలిగిన ప్రతి ఓటరు సర్‌లో భాగస్వామి కావాలి

### ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్ జూన్ 29 ప్రభాతవార్త :** మండల పరిధిలోని అల్గోల్ గ్రామంలో ఓటరు ప్రత్యేక సవరణ సర్వే ఓటు మ్యాపింగ్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, సర్పంచ్ చెల్లా శ్రీనివాస్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఓట్ మ్యాపింగ్‌ను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హత కలిగిన ప్రతి ఓటరు సర్‌లో భాగస్వామి కావాలని కోరారు. బిఎల్‌ఓలు అందజేసే ఎమ్యూనరేషన్ ఫారంలో పూర్తి వివరాలను నమోదుచేసి ఓటు హక్కును పరిరక్షించుకోవాలని సూచించారు, బూత్ లెవెల్ అధికారులు సర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. సర్వేలో ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఉన్న ఓట్లను గుర్తించి తొలగించేందుకు బిఎల్‌ఓలు కృషి చేయాలని చెప్పారు.

ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు మచ్చేందర్, రాజు, చెశ్మొద్దీన్, రాథోడ్ భీమ్‌రావు నాయక్, గోవర్ధన్‌రెడ్డి, అరుణ్‌కుమార్, బిసి సెల్ అమిత్‌కుమార్, నాయకులు పర్వేజ్ పటేల్, శ్రీకాంత్, ఇంద్రరెడ్డి, ఉపసర్పంచ్ బుజ్జమ్మ, నాయకులు అనిల్, ముబీన్, రాచప్ప, అలోక్, నర్సింలు, శ్యామ్, రాజాసాబ్, నర్సింలు, ప్రేమ్, ప్రవీణ్ బూత్ లెవెల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



అల్గోల్లో ఓటరు సవరణ సర్ ప్రత్యేక కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాణిక్యరావు

## సిసిరోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

**జహీరాబాద్, జూన్ 29 ప్రభాతవార్త:** మండలంలోని 9 గ్రామాలకు సంబంధించి ప్రతి గ్రామానికి 5 లక్షల చొప్పున 45 లక్షలతో అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే మాణిక్యరావు ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు చేశారు. అల్గోల్ రూ.5 లక్షలు, హుగ్గెల్లి రూ. 5 లక్షలు, బుచినెల్లి రూ. 5 లక్షలు, శేఖపూర్ తండా రూ. 5 లక్షలు, బూర్దిపాడ్ రూ.5 లక్షలు మొత్తం రూ.25 లక్షల నిధులతో సిసి రోడ్డు పనులకు ఎమ్మెల్యే పూజాకార్యక్రమాలు నిర్వహించి పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సిసి రోడ్డు పనులను చేపడుతున్నామన్నారు.కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు మచ్చేందర్, రాజు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు హీరూరాథోడ్, చిన్నరెడ్డి, సయీద్, పర్వేజ్‌పటేల్, శ్రీకాంత్, సోషల్ మీడియా విజయ్, అల్గోల్ గ్రామ సర్పంచ్ చెల్ల శ్రీనివాస్‌రెడ్డి, హుగ్గెల్లి గ్రామ సర్పంచ్ విమల శ్రీనివాస్‌రెడ్డి, మాజి ఎంపీటీసీ రాములు, దత్తురెడ్డి, బుచినెల్లి గ్రామ సర్పంచ్ సునీత శ్రీనివాస్, ఉప సర్పంచ్ ఇనాయత్ అలీ, శేఖపూర్ తండా సర్పంచ్ కె.మోహన్, వార్డు మెంబర్లు నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌లో స్పాట్ అడ్మిషన్స్

**చిన్నకోడూరు, జూన్ 29, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ పిఎం శ్రీతెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్ ఎంపిసీ, బైపిసి మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ పి.సతీష్‌కుమార్ సోమవారం తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 30, జూలై 1వ తేదీలలో టిసి, స్టడీ సర్టిఫికెట్స్ తీసుకుని స్కూల్‌కు రావాలని ఆయన సూచించారు.

## సబ్సిడీపై రైతులకు కంది విత్తనాలు పంపిణీ

**తొగుట, జూన్ 29, ప్రభాతవార్త :** రైతుల అభ్యున్నతి.. వ్యవసాయాభివృద్దే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎఎంసి చైర్మన్ చెరుకు విజయ్‌రెడ్డి (అమర్) అన్నారు. తొగుటలోని రైతువేదికలో సోమవారం ఆత్మకమిటీ చైర్మన్ గాంధారి నరేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ కన్నయ్యగారి హరికృష్ణరెడ్డిలతో కలిసి రైతులకు సబ్సిడీపై కంది విత్తనాలు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. ప్రతి రైతు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని వ్యవసాయంలో పురోగతి సాధించాలన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ కుర్మ యాదగిరి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బక్కోళ్ల నరిసింహారెడ్డి, మండల వ్యవసాయ అధికారి మోహన్, రైతులు లక్ష్మీ, శ్రీనివాస్, యాదగిరి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి

**బెజ్జంకి, జూన్ 29, ప్రభాతవార్త :** లబ్దిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని మాజీ ఎంపిపి, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, సర్పంచ్ బైరి మానసరాజేందర్ అన్నారు. మండల పరిధిలోని దాచారం గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వడ్లకొండ స్వప్న రమేష్ ఇంటి నిర్మాణ పనులకు భూమి పూజ చేస మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటి నిర్మాణాలు చేపట్టిన లబ్దిదారులకు విడతల వారీగా డబ్బులు ఖాతాలలో జమ అవుతున్నాయన్నారు. గూడు లేని అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ దీటి బాలనర్సు,పంచాయతీ కార్యదర్శి సురేష్, నాయకులు బొడిగే రామచంద్రం, పెంటమీద వెంకన్న, గాజుల సత్యనారాయణ, న్యాలం రాజేశం, భాస్కర్, లింగం, లక్ష్మణ్, శ్రీనివాస్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

**గజ్వేల్ టౌన్, జూన్ 29 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం మక్తమాసాన్‌పల్లి గ్రామానికి చెందిన మహ్మద్ రఫీ మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందగా ఎక్కువ మొత్తంలో ఖర్చు అయ్యాయి. ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తుచేసుకోగా మాజీ మంత్రి హరీష్‌రావు సహకారంతో రూ.60వేల చెక్కు మంజూరు కాగా చెక్కును సోమవారం మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మక్తమాసాన్‌పల్లి సర్పంచ్ ఫహీం తదితరులు పాల్గొన్నారు.

### కొల్చారంలో...

**కొల్చారం, జూన్ 29 (ప్రభాతవార్త):** నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజురెడ్డి సహకారంతో కొల్చారం మండలం పైతర గ్రామానికి చెందిన కీర్తిశేషులు పుట్టి అంజమ్మ కుటుంబానికి రూ.60 వేల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును కాంగ్రెస్ పార్టీ కౌడిపల్లి బ్లాక్ అధ్యక్షులు ఏల్లుగారి శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు కుమ్మరి భూమయ్య, వార్డు సభ్యులు దండం నవనీత్ సురేష్, కుమ్మరి సత్తయ్య, జజుల కొండయ్య, మడబోయిన శేఖర్, బోయిని అంతయ్య, కుమ్మరి శివ, ఎర్ర షాదుల్లా, కొండ నరసింహులు, చిప్ప రాములు, లబ్ధిదారుడి కుమారుడు పుట్టి శివకుమార్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ రంగంపేట గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రాజు




నూతన అధ్యక్షుడు రాజును సన్మానిస్తున పార్టీ నాయకులు

**కొల్చారం, జూన్ 29 (ప్రభాతవార్త):** బిఆర్ఎస్ పార్టీ రంగంపేట గ్రామ అధ్యక్షుడిగా ఉసికె రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ కొల్చారం మండల అధ్యక్షుడు గౌరీశంకర్ ఆధ్వర్యంలో, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి సమక్షంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి నూతనంగా ఎన్నికైన ఉసికె రాజును శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉసికె రాజు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి గ్రామ అధ్యక్షుడిగా ఎన్నుకున్న పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అరిగె రమేష్‌కుమార్, అరిగె విజయ్‌కుమార్, ఉప సర్పంచ్ చిట్కుల సురేష్, ఉసికె సుధాకర్, నీలకంటి ప్రసాద్, సత్యగౌడ్, మల్లేశం, పడెపు వెంకటేశం, మచ్చ గోపి, గంగారం, బీరప్ప, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సహకార సంఘాల వారోత్సవం



జండా ఎగరవేస్తున్న దృశ్యం

**కొల్చారం జూన్ 29 ప్రభాతవార్త :** కొల్చారం మండలం రంగంపేట గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సహకార సంఘాల వారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం చైర్మన్ అరిగె రమేష్ కుమార్ సహకార జెండాను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం రైతులకు సహకార సంఘం ద్వారా అందుతున్న సేవలు, వివిధ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. రైతులు సహకార సంఘాల సేవలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మోత్కు మల్లేశం, డైరెక్టర్లు ప్రవీణ్‌రెడ్డి, జనార్ధన్, గంగయ్య, రమేష్, సుభాష్, సీఈవో నవీన్, సిబ్బంది శ్రీను, దుర్గ రాములు పాల్గొన్నారు.

## మాదిగల్లో అక్షరాస్యత పెంపునకు 'గో టు విలేజ్'

**రాయపోల్, జూన్ 29 (ప్రభాతవార్త):** మాదిగల్లో అక్షరాస్యత పెంపు, డ్రాపౌట్‌ల నివారణ లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జూలై 5 నుండి 40 రోజుల పాటు గో టు విలేజ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ముక్కపల్లి రాజు తెలిపారు. రాయపోల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతో లభించిన 9 శాతం రిజర్వేషన్ అవకాశాలను మాదిగ యువత సద్వినియోగం చేసుకుని ఉన్నతవిద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. అలాగే జూలై 7న ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతి గ్రామంలో మాదిగ జాతి పండుగగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రవి, జర్నలిస్ట్ శ్రీనివాస్, నాయకులు ఇస్తారి, రవి, ప్రశాంత్, స్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజు

## మండలంలో ఘనంగా ఏరువాక పౌర్ణమి



ముక్తాపూర్‌లో ఏరువాక పౌర్ణమి వేడుకల దృశ్యం

**నాగల్‌గిద్ద, జూన్ 29, ప్రభాతవార్త:**
మండలంలోని ఆయాగ్రామాల్లో సోమవారం ఏరువాకపౌర్ణమి పర్వదినాన్ని రైతులు ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. రైతులు తాము సాకుతున్న ఎడ్లను, ఆవులను అందంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల్లోని ఆలయాలచుట్టూ ప్రదక్షిణలు చేయించారు.

## మండలంలో ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు



ఏరువాక పౌర్ణమిని జరుపుకుంటున్న రైతులు

**న్యాల్‌కల్, జూన్ 29, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం ఏరువాకపౌర్ణమి వేడుకలను రైతులు ఆనందోత్సాహాలతో భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. రైతులు తాము సాకుతున్న పశువులను అందంగా అలంకరించి పూజాకార్యక్రమాలు నిర్వహించి గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయంచుట్టూ ప్రదక్షిణలు చేయించారు.

## అంతర్జాతీయ సహకారశాఖ వారోత్సవాలు

**-మెదక్ పిఏసిఎస్‌లో జెండా ఆవిష్కరణ**

**మెదక్, జూన్ 29, ప్రభాతవార్త:**
అంతర్జాతీయ సహకార శాఖ వారోత్సవాల సందర్భంగా మెదక్ పిఏసిఎస్ కార్యాలయంలో సోమవారం జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో సహకారశాఖ జిల్లా అధికారి పద్మ ముఖ్య అతిథిగా పాల్గొని జెండాను ఆవిష్కరించారు. అనంతరం సహకారసంఘాల అభివృద్ధి, రైతులకు అందిస్తున్న సేవలు, సహకార వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ పిఏసిఎస్ చైర్మన్ హనుమంత్‌రెడ్డి, ఆఫీస్ సూపరింటెండెంట్ సాయిలు, పిఏసిఎస్ మానిటరింగ్ ఆఫీసర్ ఆరెల్ల రామాగౌడ్, సిఈవో సాయి తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సహకారరంగం అభివృద్ధికి అందరూ సమష్టిగా పనిచేయాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

## ఏరువాక పౌర్ణమికి ఎద్దులకు ప్రత్యేక పూజలు



ఎద్దులకు పూజలు చేస్తున్న దృశ్యం

**సదాశివపేట, జూన్ 29, ప్రభాతవార్త:**
ఏరువాక పౌర్ణమి పురస్కరించుకుని తెలంగాణ మంజీరా రైతు సమాఖ్య ఆధ్వర్యంలో ఎద్దులకు ప్రత్యేకపూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రైతులు వ్యవసాయానికి ఆధారమైన ఎద్దులను అలంకరించి సంప్రదాయపద్ధతిలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ మాట్లాడుతూ, ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగాపండాలని, రైతులు ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. వ్యవసాయం అభివృద్ధిచెందితేనే గ్రామీణ ఆర్థికవ్యవస్థ బలోపేతం అవుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో గంట శివయ్య, చిల్ల విశ్వేశ్వర్, రాం రెడ్డి, వీరేశం, ఏడుకొండలు, శ్రీనివాస్‌రెడ్డి, శివనందు, మల్కన్న, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి అధికారుల డుమ్మా



ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతున్న దృశ్యం

**చౌటకూరు, జూన్ 29, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన చౌటకూరులో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి పలు శాఖల అధికారులు డుమ్మా కొడుతుండటంతో తహసీల్దార్ నామాల కిష్టయ్య ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజల సమస్యలను నేరుగా వినేందుకు నిర్వహించే ఈ కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు విధిగా హాజరుకావాల్సి ఉండగా, పలు శాఖల అధికారులు తమ ఇష్టారీతిగా వ్యవహరిస్తూ ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. విద్యాశాఖ, పశువైద్యశాఖ, ఐసిడిఎస్ నీటి పారుదల, వ్యవసాయశాఖ, మండల అభివృద్ధి శాఖల అధికారులు హాజరవుతున్నా, మిగతాశాఖల అధికారులు తరుచూ డుమ్మా కొడుతున్నారని తహసీల్దార్ అసంతృప్తి వ్యక్తంచేశారు.

## జహీరాబాద్ మీదుగా బుల్లెట్ ట్రైన్ నడపండి

**-ప్రధానికి లింగాయత్ సమాజ్ లేఖ**

**జహీరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:**
జహీరాబాద్ మీదుగా మంజూరైన హైదరాబాద్ ముంబాయి బుల్లెట్ ట్రైన్ తిరిగి జహీరాబాద్ మీదుగా వెళ్లేవిధంగా చర్యలుతీసుకోవాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి జహీరాబాద్ పట్టణ లింగాయత్ సమాజ్ సమాజ్ అధ్యక్షులు రాజశేఖర్ శెట్కార్, కార్యదర్శి రేకులగి సుభాష్‌లు లెటర్ రాశారు. గతంలో జహీరాబాద్‌మీదుగా పూణే-ముంబై బుల్లెట్‌ట్రైన్ మంజూరు కాగా అనంతరం తిరిగి బుల్లెట్‌ట్రైన్ వికారాబాద్ మీదుగా మళ్లిస్తూ డిపిఆర్లు సిద్ధంచేశారని వారు పేర్కొన్నారు. జహీరాబాద్ ప్రాంతంలో నిమ్జ్‌లో రాబోయే రోజుల్లో పెద్దపెద్ద కంపెనీలు రాబోతున్నాయని, ఈ ప్రాంతంలో ఇటీవలే ప్రధానమంత్రి హైదరాబాద్ నుండి వర్చువల్‌గా ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్‌కు శంకుస్థాపన చేశారని, దీంతో పెద్ద ఎత్తున పరిశ్రమలు జహీరాబాద్‌కు విచ్చేయనున్నాయని, లక్షలమందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని వారందరికీ మెరుగైన రవాణాసౌకర్యం ఏర్పాటుచేయాలన్న ఉద్దేశంతోనే బుల్లెట్‌ట్రైన్ జహీరాబాద్ మీదుగా వెళ్లే విధంగా తయారు చేయగా, దాన్ని మళ్లీ వికారాబాద్ మీదుగా ఇస్తున్నారని ఈప్రతిపాదన వెంటనే విరమించుకుని తమరు కల్పించుకొని వెళ్లే ట్రైన్ వయా జహీరాబాద్ మీదుగా వెళ్లేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రధానమంత్రికి విజ్ఞప్తిచేశారు.

## ప్రొఫెసర్ మహలనోబిస్ సేవలు మరువలేనివి

**-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



చిత్రపటానికి పూల మాలలు వేస్తున్న దృశ్యం

**మెదక్, జూన్ 29, ప్రభాతవార్త:**
మెదక్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జాతీయ గణాంక దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా మహలనోబిస్ చిత్రపటానికి అదనపు కలెక్టర్ నగేష్, ఇతర జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ ప్రతిమాసింగ్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక ప్రణాళికలు, దేశాభివృద్ధిలో గణాంకాల ఆవశ్యకతపై యువతకు, అధికారులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్‌ఓ అంబదాస్ రాజేశ్వర్, జడ్పి సిఈఓ ఎల్లయ్య, డిఆర్‌డిఓ పిడి శ్రీనివాసరావు, డిపిఓ యాదయ్య, సిపిఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యూరియా బుకింగ్‌లో సర్వర్ సమస్యలు

**-అయోమయంలో రైతన్నలు**



యూరియా కోసం ఆగచాట్లు పడుతున్న రైతుల దృశ్యం

**చౌటకూరు, జూన్ 29, ప్రభాతవార్త:**
యూరియా కోసం రైతులకు ఆగచాట్లు తప్పడం లేదు. మండల కేంద్రమైన చౌటకూరులో సోమవారం ఉదయం 5.30 గంటల నుంచే యూరియా బుకింగ్ కోసం రైతులు తమ మొబైల్ ఫోన్‌లలో ప్రయత్నాలు చేయడం ప్రారంభించినా సర్వర్ సమస్యలు, సాఫ్ట్‌వేర్‌లో తలెత్తిన సాంకేతిక లోపాల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుకింగ్‌ప్రక్రియ సక్రమంగా సాగకపోవడం, తరుచూ ఎర్రర్ సందేశాలు కనిపించడం, వివరాలు నమోదు చేసాని ప్రక్రియ పూర్తి కాకపోవడం లాంటి సమస్యలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఖరీఫ్ పనులు వేగంగా కొనసాగుతున్నా ఈ సమయంలో యూరియా అవసరం అధికంగా ఉండటంతో రైతులు ముందస్తుగా బుకింగ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే సాంకేతిక సమస్యలతో బుకింగ్ ప్రక్రియ ఆలస్యం కావడంతో యూరియా అందుతుందా? లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది రైతులు గంటల తరబడి ఫోన్‌లలో ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సర్వర్ సమస్యలను పరిష్కరించి, రైతులకు అంతరాయంలేకుండా యూరియా బుకింగ్‌ప్రక్రియను నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.

## ప్రజావాణిలో ఖాళీ కుర్చీకి వినతిపత్రం

**-ప్రజావాణిలో అధికారులు అందుబాటులో ఉండాలి**

**-డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్**



ఖాళీ కుర్చీకి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

**సదాశివపేట, జూన్ 29, ప్రభాతవార్త:**
సదాశిపేట తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈరోజు డివైఎఫ్ఐ యువజన సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లడం జరిగింది. ఆ క్రమంలో అధికారులు ప్రజావాణిలో మధ్యాహ్నం 12 అవుతున్న ఎవరూ అందుబాటులో లేకపోవడంతో ఖాళీ కుర్చీకి వినతి పత్రం ఇచ్చి నిరసన తెలియజేయడం జరిగింది. ఈసందర్భంగా డివైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ సదాశిపేట మండలంలో ఉన్న ప్రైవేటు విద్యాసంస్థల్లో అధికఫీజుల దోపిడీని అరికట్టాలి. నిబంధనలు పాటించని ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలుతీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు విద్యాసంస్థల్లో టెక్స్ట్‌బుక్స్, నోట్‌బుక్స్ వంటివి అమ్మడం చట్టరీత్యా నేరం. వీటిని అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయింది. ప్రభుత్వాన్ని విరుద్ధంగా వేలరూపాయలలో ఫీజులు వసూలుచేస్తున్నా, సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ఈ సమస్యలపై అధికారులు దృష్టికి తీసుకెళ్లటానికి ప్రయత్నిస్తే అధికారులు అందుబాటులో లేకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తుందని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, అభిషేక్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు

**చౌటకూరు, జూన్ 29, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన చౌటకూరుతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం ఏరువాక పౌర్ణమిని రైతులు ఆనందోత్సవాలతో భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. రైతులు తాము సాకుతున్న పశువులను అందంగా అలంకరించుకుని గ్రామాల్లోని ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించి ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. భూమాతకు అన్నదాతలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

# సిఎం సిగాచీ బాధితులకు ఇచ్చిన హామీ నెరవేర్చరా..?

**-సిఐటియు రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు అతిమేల మానిక్**

**-సిఐటియు ఆధ్వర్యంలో సిగాచీ బాధిత కుటుంబాలతో ర్యాలీ**



సిఐటియు ఆధ్వర్యంలో మహాధర్నా

**పటాన్‌చెరు, జూన్ 29, ప్రభాతవార్త:**
సిఎం రేవంత్‌రెడ్డి సిగాచీబాధితులకు ఇచ్చిన కోటి రూపాయలు హామీ నెరవేర్చరా..? అని సిఐటియు రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు అతిమేల మానిక్ తీవ్రస్థాయిలో ప్రభుత్వంపైన విరుచుకుపడ్డారు. సిగాచీ ప్రమాద బాధితులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలో సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో సిగాచీ బాధిత కుటుంబ సభ్యులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు, పాశమైలారం ఇండస్ట్రియల్ క్లస్టర్ కన్వీనర్ మాణిక్ మాట్లాడుతూ సిగాచి పరిశ్రమలో ఘోర ప్రమాదం జరిగి 54మంది కార్మికులు మృత్యుఘోష ఘటనకు ఏడాది అయిందన్నారు. మృతుల బాధిత కుటుంబాలకు సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ నెరవేర్చరా..? అని ప్రశ్నించారు. దేశంలోనే భూపాల్ ఘటన తర్వాత సిగాచీ ప్రమాద దుర్ఘటనే అన్నారు. 54 మంది మృతిచెంది అందులో 8 మంది పూర్తిగా కాలి బూడిదయి డిఎన్ఎ టెస్ట్‌కు సైతం దొరకకపోవడం చూస్తే ప్రమాదం తీవ్రత ఏ స్థాయిలో జరిగిందో అర్థమవుతుందన్నారు. మరో 28మంది కార్మికులు తీవ్ర గాయాలపాలై జీవచ్ఛవాల్లా బతుకీడుస్తున్నారని వాపోయారు. ఆసుపత్రిలో చూపించుకునేందుకు డబ్బులులేక కుటుంబాలు గడవక ఆర్థికంగా చితికిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మృతుల కుటుంబాలకు కోటిరూపాయలు నష్టపరిహారం ఇప్పిస్తామని సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి ప్రకటించారని, ఇదేవిషయాన్ని యాజమాన్యం సెబీకిచ్చిన లేఖలో ప్రకటించిందని, ఘటన జరిగి ఏడాది అవుతున్నా ఇంకా పూర్తినష్టపరిహారం అందకపోవడం దారుణమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రెండు లక్షలు కొంతమందికి అందలేదని, నష్టపరిహారంలో రాష్ట్రప్రభుత్వం లక్ష, కేంద్రప్రభుత్వం రెండులక్షలు కలుపుతున్నారన్నారు. ప్రమాదానికి యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమైనప్పటికీ యాజమాన్యంపై కంటితుడుపు చర్యగా కంపెనీ సిఈవోను అరెస్టుచేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. బాధిత కార్మికకుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వమంటే యాజమాన్యానికి చేతులు రావడంలేదని ఏపీలో వేల కోట్ల పెట్టుబడులు పెడుతుందని మండిపడ్డారు. సిగాచీ ప్రమాదం నుండి గుణపాఠం తీసుకొని పరిశ్రమల్లో కార్మికుల రక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనేక పరిశ్రమల్లో రోజురోజుకు ప్రమాదాలు పెరుగుతున్నాయని, అందుకు యాజమాన్యాల నిర్లక్ష్యమే కారణమని, బాధితకుటుంబాలకు మిగతా నష్టపరిహారం ఇప్పించేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలుతీసుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు రాజు, నాయకులు సంతోష్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, రాజశేఖర్, చరణ్, రమేష్, నాగరాజు, వెంకటేష్, దుర్గేష్, మృతిచెందిన కార్మికుల కుటుంబాల సభ్యులు జస్టిన్, భీమ్రావు, అన్సారి, అఖిలేష్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శిశుమందిరాల అభివృద్ధికి రోటరీ క్లబ్ నిరంతర సహాయ సహకారాలు

**-లేక్ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ రాజశేఖర్ వోదెల**



అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న దృశ్యం

**సదాశివపేట, జూన్ 29, ప్రభాతవార్త:**
సమాజంలో విలువలతో కూడిన విద్యను అందిస్తున్న శ్రీసరస్వతి శిశుమందిరాల అభివృద్ధిలో పాలుపంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, పాఠశాలల అభివృద్ధికి అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి ఎల్లప్పుడూ ముందుంటామని రోటరీక్లబ్ లేక్ డిస్ట్రిక్ట్ అధ్యక్షులు రాజశేఖర్ వోదెల తెలిపారు. సదాశివపేట పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాల నూతన అంతస్తును ఆయన ముఖ్యఅతిథిగావిచ్చేసి ఘనంగాప్రారంభించారు. కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ట్ కార్యదర్శి శివాని, నీలిమ ఓదెల, సదాశివపేట రోటరీక్లబ్ కార్యదర్శి అశోక్ బుస, ఎలెక్టెడ్ కార్యదర్శి రాచన్నస్వామి, కోశాధికారి వేణు, సర్వీస్ డైరెక్టర్ చేల మల్లన్న, చిలుకూరి నరేందర్, ప్రవీణ్, అన్నపూర్ణ, సుధీర్ పాల్గొన్నారు. అలాగే పాఠశాలసమితి అధ్యక్షులు రామకృష్ణ, పాఠశాలకమిటీ అధ్యక్షులు అశోక్, కార్యదర్శి తంగడపల్లి లక్ష్మణ్, సరాపు శ్రీనివాస్, కోడూరు అంజయ్య పాఠశాల ప్రధానాచార్యులు సంగమేశ్వర్, ఇతర కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ బృందం ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

## ఆగ్రోస్ రైతు సేవాకేంద్రం పరిశీలన



రైతు సేవాకేంద్రాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారిణి ప్రవీణ

**చౌటకూరు, జూన్ 29, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన చౌటకూరులోని ఆగ్రోస్ రైతుసేవా కేంద్రాన్ని సోమవారం మండల వ్యవసాయ అధికారిణి ప్రవీణ పరిశీలించారు. ఈసందర్భంగా యూరియా పంపిణీవిధానాన్ని పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సక్రమంగా పంపిణీచేయాలని నిర్వాహకులకు సూచించారు. రైతులు ఇబ్బందులుపడకుండా ముందస్తుచర్యలు తీసుకోవాలని, పంపిణీలో పారదర్శకత పాటించాలని ప్రవీణ అధికారులను ఆదేశించారు.

## దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్న అనిమిశెట్టి జయప్రకాశ్

**సదాశివపేట, జూన్ 29, ప్రభాతవార్త:**
ఏరువాక పున్నమి సందర్భంగా కర్ణాటక రాష్ట్రంలోని గనగాపూర్ శ్రీగురు దత్తాత్రేయస్వామి ఆలయాన్ని సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం గౌరవ సలహాదారులు అనిమిశెట్టి జయప్రకాశ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో జీవించాలని, రైతులు పంటలతో ఆనందంగా ఉండాలని దత్తాత్రేయ స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం యువజన అధ్యక్షులు బుగ్గనగారి మల్లికార్జున్, కంది మాజీసర్పంచ్ వీరేశం, గోపాల్, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి ధర్మారంలో పిఏసిఎస్ సబ్ సెంటర్

**రామాయంపేట, జూన్ 29, ప్రభాతవార్త:**
రైతులకు ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా రామాయంపేట మండలం ప్రగతి ధర్మారం గ్రామంలో రామాయంపేట పిఏసిఎస్ బ్రాంచ్ ఆధ్వర్యంలో సోమవారం సబ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేంద్రంలో స్థానిక సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాసాయిపేట మల్లేశం చేతుల మీదుగా రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో పిఏసిఎస్ సబ్ సెంటర్ ఏర్పాటు కావడంతో రైతులు ఇకపై ఎరువుల కోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరంలేకుండా గ్రామంలోనే సేవలు పొందే అవకాశం కలిగిందని గ్రామస్థులు ఆనందం వ్యక్తంచేశారు. సబ్ సెంటర్ ఏర్పాటుకు సహకరించిన పిఏసిఎస్ సిఈఓ నరసింహులు, మెదక్ డిసిఓ, మెదక్ డిఏఓలకు గ్రామప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ కార్యాలయ సిబ్బంది కొండల్‌రెడ్డి బృందంతోపాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు పోగుల నాంపల్లి, వడ్ల శ్రీశైలం, షాదుల్లా, చాకలి చిన్న నారాయణ, సుతారి యాదగిరి, పెండెల శ్రీనివాస్, దొమ్మాట నాగయ్య, కమ్మరి రాజయ్య, గ్రామరైతులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సబ్‌సెంటర్ ప్రారంభంతో రైతులకు ఎరువుల సరఫరా మరింత సులభతరం అవుతుందని, వ్యవసాయ అవసరాలకు వేగంగా సేవలు అందుబాటులోకి వస్తాయని నిర్వాహకులు తెలిపారు.

## తహసీల్దార్ నూతన భవన నిర్మాణానికి రూ.2కోట్ల 25లక్షల మంజూరు



మాట్లాడుతున్న మండలాధ్యక్షులు సతీష్, ఎఎంసిచైర్మన్ సుధాకర్‌రెడ్డి

**మునిపల్లి, జూన్ 29, ప్రభాతవార్త:**
అందోల్ నియోజకవర్గంలోని మునిపల్లిమండల తహసీల్దార్ కార్యాలయం కొత్త భవన నిర్మాణానికి 2కోట్ల 25లక్షలు మంజూరు అయినట్టు మార్కెట్‌కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సతీష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ ప్రత్యేకకృషితో మండలంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాట్టు వారు అభిప్రాయం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు చెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి రాంరెడ్డి, కాంగ్రెస్‌పార్టీ మండల నాయకులు బాబూపాటిల్, మక్సూద్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ ఎక్సలెంట్ డిస్ట్రిక్ట్ సెక్రటరీగా డాక్టర్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి

**రామాయంపేట, జూన్ 29, ప్రభాతవార్త:**
గత ఏడాదికాలంగా రక్త, అవయవదానాలపై విస్తృత అవగాహన కల్పించినందుకుగాను రామాయంపేట పట్టణానికి చెందిన లయన్ డా.ఏలేటి రాజశేఖర్‌రెడ్డికి ఎక్సలెంట్ డిస్ట్రిక్ట్ సెక్రటరీగా అవార్డు అందుకున్నారు. ఆదివారం సాయంత్రం కండ్లకోయలోని నిమ్మల కన్వెన్షన్‌లో జరిగిన దిల్సే డిస్ట్రిక్ట్ అవార్డుల ప్రదానోత్సవంలో గత ఏడాదికాలంగా రక్త, అవయవ దానాలపై విస్తృత అవగాహన కల్పించినందుకు, 26గోడపత్రికలను రూపొందించి లయన్స్ జిల్లా 320డి పరిధిలోని పట్టణాలు, మారుమూల గ్రామాల్లో సైతం యువతలో చైతన్యం తెచ్చినందుకు లయన్ డాక్టర్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డిని ఎక్సలెంట్ డిస్ట్రిక్ట్ సెక్రటరీగా ఎంపికచేసినట్లు లయన్స్ పాస్ట్‌ఇంటర్నేషనల్ డైరెక్టర్, లయన్ డాక్టర్ ఘట్టమనేని బాబురావు ప్రకటించారు. లయన్స్ గవర్నర్ లయన్ ఎ.అమర్నాథ్‌రావు, పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ లయన్ చీటీ ప్రకాష్‌రావు చేతులమీదుగా రాజశేఖర్‌రెడ్డికి అవార్డు ప్రదానంచేశారు. కార్యక్రమంలో లయన్స్ 320 డి జిల్లా క్యాబినెట్ సభ్యులు, హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన నిర్మల్, భైంసా ప్రాంతాల లయన్స్ సభ్యులు, రామాయంపేట లయన్స్ సభ్యులు పాల్గొన్నారు. గోడపత్రికల ద్వారా చక్కని అవగాహన కల్పిస్తున్న రాజశేఖర్‌రెడ్డిని ఈసందర్భంగా పలువురు అభినందించారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**-ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**గుమ్మడిదల, జూన్ 29, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మండలపరిధిలోని మంబాపూర్, నల్లవల్లి, కొత్తపల్లి, నాగిరెడ్డిగూడెం, కానుకుంట, అనంతారం, గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా మంజూరైన 70లక్షల నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సోమవారం మండలప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి శంకుస్థాపనలుచేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. ప్రతిగ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకొని వెళ్ళడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. నిర్దేశించిన గడువులోగా అభివృద్ధిపనులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్‌గౌడ్, ఎంపిడివో ఉమాదేవి, బిఆర్‌ఎస్ రాష్ట్రనాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు సద్ది విజయభాస్కర్‌రెడ్డి, నక్క వెంకటేష్‌గౌడ్, సర్పంచ్‌లు కొత్తకొండ భాస్కర్, కొరివి రాణిసురేష్, సూరారం మంజులసత్తయ్య, గడ్డం లావణ్యగోవర్ధన్‌రెడ్డి, కొమ్ము శ్రీను, ఇప్ప పెంటారెడ్డి, బుద్దుల దుర్గనర్సింగ్‌రావు, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు. ముఖ్యకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సైని సన్మానించిన మల్లికార్జునపల్లి గ్రామస్థులు



ఎస్సై అరవింద్‌ను సన్మానిస్తున్న మల్లికార్జునపల్లి గ్రామస్థులు

**మునిపల్లి, జూన్ 29, ప్రభాతవార్త:**
నూతనంగా బాధ్యతలు చేపట్టిన మునిపల్లి ఎస్సై అరవింద్‌ను సోమవారం మల్లికార్జునపల్లి సర్పంచ్ మల్లేశం ఆధ్వర్యంలో గ్రామస్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిచ్చయ్య, బిచ్చన్న, నర్సింలు, కుమార్, శ్రీకాంత్‌గౌడ్, గొల్ల విష్ణు, ఎరుకలి లక్ష్మయ్య, దేవదాసు, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.